ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.60 (310.8498)	51,282	51,282
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.95 (4.18)	4,132.84	3,983.93
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.440 (44.8973)	34,274	58,736

చికెన్ ధరలు | లైవ్ : రూ.149 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



విద్యుత్ అధికారుల ప్రజాబాట

విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించడమే లక్ష్యంగా విద్యుత్‌శాఖ 'ప్రజాబాట' కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా వారంలో మూడు రోజులు మంగళ, గురు, శనివారాల్లో ఎస్ఈ నుంచి ఆర్టిజన్ స్థాయి వరకు ఉన్న సిబ్బంది, అధికారులు నేరుగా క్షేత్రస్థాయిలో పర్యటి స్తూ విద్యుత్ నెట్‌వర్క్‌ను తనిఖీ చేస్తున్నారు. అంతేగాక వినియోగదారుల నుంచి నేరుగా ఫిర్యాదులు, సలహాలు తీసుకుంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ టౌన్)

- వారానికి మూడు రోజులు
- క్షేత్ర స్థాయిలో విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం

కొన్నింటిని తక్షణమే పరిష్కరిస్తున్నాం



వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడమే లక్ష్యంగా 'ప్రజాబాట' కార్యక్రమం చేపడుతున్నాం. అందులో భాగంగా సరఫరాలో అంతరాయం తలెత్తకుండా సాధ్యమైనంత వరకు అందుబాటులో ఉన్న సామగ్రితో సమస్యలను పరిష్కరిస్తున్నాం. నూతన స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల తదితర ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తున్నాం. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పెరిగిన మొక్కలను, విద్యుత్ తీగలకు అల్లుకుంటున్న తీగ మొక్కలను తొలగిస్తున్నాం.

- వెంకటేశ్వర్లు, ఎస్ఈ, నల్లగొండ

విద్యుత్ అధికారులు నేరుగా ప్రజల వద్దకు వస్తుండటంతో గ్రామాలు, పట్టణాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు వారి దృష్టికి వస్తున్నాయి. అదేవిధంగా అధికారులు వారంలో మూడు రోజుల పాటు 'ప్రజాబాట' కోసం వస్తున్నారని తెలిసి ప్రజలు సైతం నేరుగా కలిసి సమస్యలు విన్నవిస్తున్నారు. ఫలితంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు సైతం పరిష్కారం లభిస్తోంది. 'ప్రజాబాట'లో ఎల్టీ లైన్లు, 11కేవీ, 33కేవీ లైన్లను, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను, ఏబీ స్విచ్ వంటి విద్యుత్ పరికరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. దీంతో విద్యుత్ సరఫరాలో నాణ్యత మరింత మెరుగుపడుతోంది. దీనికి తోడు ఫిర్యాదులు తగ్గడంతో పాటు నెట్‌వర్క్ బలపడి విద్యుత్ లాస్ (నష్టం) కూడా తగ్గుతోంది. నిర్దేశించిన మేరకు వారంలో మూడు రోజులు ఉదయం 8 నుంచి 10.30గంటల వరకు విద్యుత్ అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం

తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ పరిధిలోని అన్ని ఉమ్మడి జిల్లాలతో పాటు ఉమ్మడి నలగొండ జిల్లాలో విద్యుత్ అధికారుల 'ప్రజాబాట' ప్రారంభమైంది. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలో ఈ కార్యక్రమం లాంచనంగా ఈ నెల 6వ తేదీన ప్రారంభమైంది. మూడు జిల్లాలో కూడా ఎస్ఈ స్థాయి క్యాడర్ నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అంతా 'ప్రజాబాట' కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకుంటున్నారు. విద్యుత్ నెట్‌వర్క్‌ను పరిశీలించి వినియోగదారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తున్నారు.


ప్రాంతాల వారీగా పర్యటనలు

'ప్రజాబాట' కార్యక్రమంలో భాగంగా అధికారులు సిబ్బంది ప్రాంతాల వారీగా పర్యటించి సమస్యలను గుర్తించాలని నిర్ణయించారు. అందులో భాగంగా వారంలో మూడు రోజులు ప్రాంతాల వారీగా ప్రత్యేక షెడ్యూల్ రూపొందించుకొని ఆ దిశగా ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. సమస్యలను గుర్తించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల ప్రారంభించిన 'ప్రజాబాట' కార్యక్రమంలో భాగంగా విద్యుత్ అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యటించి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పెరిగిన మొక్కలను, విద్యుత్ తీగలకు అల్లుకుంటున్న తీగ..

- మిగతా 8వ పేజీలో...

నాయకులంతా హైదరాబాద్‌లోనే

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో వివిధ పార్టీల నాయకులు



జిల్లా నాయకులంతా హైదరాబాద్‌లో మకాం వేశారు. రాష్ట్ర రాజధానిలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో వివిధ పార్టీల నాయకులు అక్కడ ప్రచారంలో పాల్గొంటున్నారు. పోటాపోటీగా కొనసాగుతున్న ప్రచారంలో తమ పార్టీల అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తూ గెలుపు కోసం కృషి చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

కొద్దిరోజులుగా జిల్లాలోని అన్నిపార్టీల నాయకులు అంతా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే ఉంటూ ప్రచారంలో మునిగిపోయారు. తమకు తెలిసిన బంధువులను, నాయకులను సమన్వయం చేసుకుంటూ గెలుపు కోసం తీవ్రంగా కష్టపడుతున్నారు. దీంతో జిల్లాలో నాయకుల సందడి కొద్దిరోజులుగా కనిపించడం లేదు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే నాయకులు సైతం జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో నిమగ్నమయ్యారు. ఇంటింటికి తిరుగుతూ అభ్యర్థుల గెలుపు వేటలో ముందుకు సాగుతున్నారు. తమ బంధువులకు ఫోన్లు చేస్తూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గమైన జూబ్లీహిల్స్‌లో సుమారు 4లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. ధనవంతులతో పాటు వెనుకబడిన ప్రాంతాలే ఎక్కువగా ఉన్నాయి. బస్తీల్లో పలుకుబడి ఉన్న నాయకుడిని మచ్చిక చేసుకుంటేనే అక్కడ గెలుపు సాధ్యమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని నాయకులు కూడా వారికి ఉన్న పరిచయాలను వాడుకుంటూ గెలుపు కోసం కృషి చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి మంత్రులు, రాష్ట్ర నాయకులు రంగంలోకి దిగారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అదేవిధంగా మరోమంత్రి కోమటిరెడ్డివెంకట్‌రెడ్డి కూడా ప్రతి ర్యాలీలో పాల్గొంటున్నారు. మాజీమంత్రి జగదీష్‌రెడ్డి పూర్తిగా జూబ్లీహిల్స్‌లో మకాం వేశారు. ప్రతీ గడపకు వెళ్లి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. మొత్తంమీద జిల్లాలో వివిధ పార్టీల

- మిగతా 8వ పేజీలో...

మితంగా తింటే ఆ'హారం'

- లేదంటే ఇక అంతే సంగతి
- మెరుగైన జీవన విధానం.. మారుతున్న శైలి
- ఒక్కొక్కరిదీ ఒక్కో విధానం
- పర్యవేక్షణ అవసరమంటున్న నిపుణులు

7



ఉరుకుల పరుగుల జీవనం. త్వర త్వరగా కావాలన్న కాంక్ష. తీరొక్క రుచి కోరే జిహ్వ. వెరసి ఏం తింటున్నామో.. ఎంత తింటున్నామో.. ఎందుకు తింటున్నామో.. తెలియకుండా పొట్టను నింపుతున్నాం. దీంతో ఊబకాయం, మధుమేహం, బీపీ.. తదితర రుగ్మతలు దీర్ఘకాలంగా వెంటాడడం పరిపాటిగా మారింది. అయితే మారుతున్న జీవన శైలిలో మితమైన ఆహారమే అమృతమని, లేదంటే విషంగా మారే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోజూ తీసుకునే ఆహారంలో ఖచ్చితంగా డైట్ పాటించాలని, లేకుంటే శరీరం రోగాల కుప్పగా మారుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, అందులో ప్రొటీన్లు, విటమిన్లు, కార్బోహైడ్రేట్లు, మాంసకృత్తులు తగిన పాళ్లలో ఉండాలంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

చండూరు పీహెచ్‌సీలో ఖాళీగా కుర్చీలు

హాజరు కాని ఇద్దరు ఉద్యోగులు

చండూరు,నవంబరు8(ఆంధ్రజ్యోతి):చండూరు మునిసిపల్ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యులు సకాలంలో రాకపోవడంతో అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు ఎదురుచూసి వెళ్లిపోతున్నారు. ఉదయం 9గంటలకే ఆరోగ్యకేంద్రానికి చేరుకోవాల్సిన వైద్యులు, సిబ్బంది శనివారంమధ్యాహ్నం 12.32గంటలు అవుతున్నా ఒక్కరూ రాలేదు.

పర్యవేక్షణేదీ?

ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో వైద్యులు, సిబ్బంది డ్యూటీలకు డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్య కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి. కానీ, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం మధ్యాహ్నం 12.32 గంటల వరకు కేవలం ఐదుగురు సిబ్బంది మాత్రమే హాజరుకాగా, మరికొందరు సెలవులో ఉన్నారు. కొందరు మాత్రం సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా హాజరయ్యారు. దీంతో 100మందికి పైగా రోగులు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వైద్యాధికారులు లేకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు 24 గంటలు వైద్య సేవలు అందించాల్సి ఉండగా, ఒక్కరూ కనిపించలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని వివరణ కోరగా, ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండాల్సిందేనని, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరైన ఘటననూ విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చండూరు పీహెచ్‌సీలో మధ్యాహ్నం 12.32 గంటల వరకు కూడా ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యాధికారి కుర్చీ

ఇద్దరు డుమ్మా

చండూరు పీహెచ్‌సీలో 24గంటల పాటు వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఇద్దరు పురుష, మహిళా వైద్యులను నియమించారు. వీరు షిఫ్టుల వారీగా పని చేయాలి. కానీ, ఈ నిబంధన అమలుకు నోచుకోవడం లేదు. పీహెచ్‌సీలో సీసీ కెమెరాలు ఉన్నాయి. ఈ కెమెరాల ద్వారా పీహెచ్‌సీలో వైద్యులు ఉన్నారో, లేదో తెలుసుకునేందుకు డైరెక్టర్ కార్యాలయంలో మానిటరింగ్ సెల్ కూడా ఏర్పాటు చేశారు. ఈ సెల్ ద్వారా పీహెచ్‌సీలో ఏం జరుగుతుందో లైవ్‌లో చూసేలా సీసీ కెమెరాలను అనుసంధానం చేశారు. కానీ, చండూరు పీహెచ్‌సీలో కెమెరాలు పని చేయకపోవడంతో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వైద్యులు ఇష్టారాజ్యంగా విధులకు డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

రండి.. రండి.. రండి దయచేయండి

- హోటళ్లకు దిక్కూచిలా విజిల్ బ్లోయర్స్
- మెడలో విజిల్...చేతిలో లాఠీ, లైటర్లు
- భోజనానికీ విరామం లేని సమయం
- వయసు మళ్లిన వారే ఎక్కువ

సండే స్పెషల్ SUNDAY SPECIAL

6

ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకురావాలి

డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

కనగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి ఐకేపీ కేంద్రాలకు తీసుకురావాలని డీఆర్డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కనగల్, కుమ్మరిగూడెం, ఎంగౌరారంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకొని, రికార్డులను పరిశీలించారు. తేమశాతం వచ్చిన ధాన్యం రాశులను వెంటనే కాంటా వేయాలని ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం మైసేశ్వర్‌రావ్, సీసీ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి



108 కుండలాలతో గాయత్రీ జ్ఞాన మహాయజ్ఞం

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో 108 కుండలాలతో రెండు రోజుల పాటు నిర్వహించిన గాయత్రి జ్ఞాన మహాయజ్ఞం శనివారం ముగిసింది.

- కొండమల్లేపల్లి

బౌద్ధుల ఆరాధన క్షేత్రం.. సాగర్

- థాయ్‌లాండ్ బౌద్ధ భిక్షువులు

7

సన్నాల సాగుకు రైతుల ఆసక్తి

- తక్కువ కాలం, అధిక దిగుబడి
- ఉమ్మడి జిల్లాలో 'టిప్‌టాప్'కు పెరిగిన డిమాండ్

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు8: వానాకాలం, యాసంగి సీజన్లలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రైతులు ఎక్కువగా వరి పంటను సాగు చేస్తున్నారు. నాగార్జునసాగర్, మూసీ, శ్రీరాంసాగర్ ఆయకట్టులో సాగు నీరు వస్తుండడంతో రైతులు మెట్ట పంటలకు ప్రత్యామ్నాయంగా వరి సాగు చేస్తున్నారు. అందులో ఎక్కువగా సన్నరకం ధాన్యం పండించేందుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో యాసంగిలో దొడ్డురకం ధాన్యం సాగుచేసేవారు. ఇటీవల యాసంగిలో కూడా సన్నరకం సాగు చేస్తున్నారు. వానాకాలం సన్న ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసింది. విత్తన కంపెనీలు కొన్నేళ్లుగా సన్నరకం ధాన్యం విషయంలో నాణ్యమైన విత్తనాలు తయారు చేస్తున్నాయి. అధిక దిగుబడి, పెట్టుబడి తక్కువ, పంట కాలం తక్కువ ఉండే వరి విత్తనాలను కంపెనీలు మార్కెట్‌లో అందుబాటులో ఉంచాయి. సన్న ధాన్యం రాష్ట్రంలోనేగాక ఇతర రాష్ట్రాలకూ ఎగుమతి అవుతోంది. మార్కెట్‌లో పలు విత్తన కంపెనీలు నాణ్యమైన, మేలైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

'టిప్‌టాప్'కు పెరిగిన డిమాండ్

ఉమ్మడి జిల్లాలో రైతులు ఎక్కువగా యాసంగి సీజన్‌లో 'టిప్‌టాప్' రకం ధాన్యం సాగు చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం మార్కెట్‌లోకి వచ్చిన జీనెక్స్ సీడ్స్ కంపెనీకి చెందిన 'టిప్‌టాప్' రకం వరి విత్తనాలకు డిమాండ్ పెరిగింది. మార్కెట్‌లో లభించే ఇతర విత్తనాల కంటే 'టిప్‌టాప్' రకం మేలుచేకూర్చేలా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఈరకం విత్తనాలు సాగు చేస్తే వరి తక్కువ ఎత్తులో పెరుగుతుంది. దీంతో గాలి, వానలు వచ్చినా పంట నేలవాలదు. అంతేగాక ధాన్యం సన్నగా ఉంటుంది. అత్యధికంగా పిలకలు వేస్తుంది. సాధారణంగా ఇతర రకాలు దుబ్బకు 15 నుంచి 25 పిలకలు వస్తాయి. టిప్‌టాప్ రకం అయితే 30 నుంచి 70 పిలకల వరకు వృద్ధి చెందుతాయి. దీంతో దిగుబడి కూడా అధికంగా వస్తుంది. ఎకరాకు సుమారు 50 నుంచి 55 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. ఇతర వంగడాలతో పోలిస్తే 'టిప్‌టాప్' వంగడానికి అయ్యే ఖర్చు చాలా తక్కువ. చీడపీడలను తట్టుకునే శక్తి కూడా ఉంటుంది. ఈ రకం వంగడం ఎలాంటి నేలలోనైనా సాగు చేయవచ్చు. పంట 120 నుంచి 130 రోజుల్లో చేతికి వస్తుంది. ఎకరాకు 10కిలోల విత్తనాలు సరిపోతాయి. దీంతో రైతులు టిప్‌టాప్ రకం సాగుకు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో ఈ రకం ధాన్యానికి తేమ శాతం 28 నుంచి 30 ఉన్నా మిల్లర్లు క్వింటాకు రూ.2400 నుంచి రూ.2700లకు కొనుగోలు చేస్తున్నారు. కోత కోయగానే పచ్చి ధాన్యాన్ని కూడా విక్రయించవచ్చు. టిప్‌టాప్ రకం ధాన్యంలో ఆయిల్ శాతం ఎక్కువగా ఉండి తినడానికి రుచిగా ఉంటుంది.



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గత యాసంగి సీజన్‌లో సాగు చేసిన 'టిప్‌టాప్' రకం వరి పొలాలు

52 బస్తాల దిగుబడి



ప్రతి యాసంగి సీజన్‌లో టిప్‌టాప్ రకం ధాన్యాన్ని సాగు చేస్తున్నా. ఇప్పటి వరకు నాలుగు సీజన్లలో టిప్‌టాప్ రకాన్ని సాగు చేశా. ఎకరాకు 52 బస్తాల దిగుబడి వచ్చింది.

ఎన్. సతీష్, రైతు, కొండ్రపోల్ గ్రామం, దామరచర్ల మండలం, నల్లగొండ జిల్లా

రైతుల ఆసక్తి



వానాకాలంలో పాటు యాసంగిలో కూడా రైతులు సన్నరకం ధాన్యం సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువగా యాసంగిలో టిప్‌టాప్ రకం సాగు చేస్తున్నట్లు క్షేత్రస్థాయిలో రైతుల నుంచి సమాచారం వస్తుంది.

శ్రవణ్‌కుమార్, జేడీఏ నల్లగొండ.

ADVT

55 వస్తువులపై సీఎం రేవంత్ రూపాలు

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కొరటికల్ గ్రామానికి చెందిన నఖ చిత్రకారుడు మహేశ్వరం నరహరి ప్రత్యేకంగా తన అభిమానాన్ని చాటుకున్నారు. 55 రకాల వస్తువులపై రకరకాలుగా సీఎం రేవంత్‌రెడ్డి బొమ్మలు చిత్రించారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేటలోని సిస్టర్ నివేదిత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్‌గా పని చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చిత్రాలు 55 బొమ్మలు చిత్రించేందుకు 42రోజులు శ్రమించినట్టు ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలకు సంబంధించిన ఉచిత బస్సు ప్రయాణ టికెట్, జీరో కరెంట్ బిల్లు, వంట గ్యాస్ కార్డు, రేషన్‌కార్డు, సీఎం సహాయనిధి చెక్కు లాంటి వాటితో పాటు పెయింటింగ్ బ్రష్, స్తెతస్కోప్, నెమలి ఈక, కోడిగుడ్డు, చెయ్యి (హస్తం), పెన్సిల్, పెన్ను, చేతి వేలిగోరు, మైక్, టెంకాయ, అద్దం, చేతి గడియారం, బాదం పప్పు లాంటి 55 రకాల వస్తువులపై సీఎం బొమ్మలు వేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వాటిని ఆయనకు అందజేస్తానన్నారు. నరహరి 30 ఏళ్లకు పైగా తనచేతి వేలి గోర్లను పెంచి సుమారు 150కి పైగా జాతీయ నాయకులు, ప్రకృతి సౌందర్యాలు, వివిధ రకాల బొమ్మలు గోళ్లపై చిత్రీకరించి పలు అవార్డులు అందుకున్నారు. మహాత్మా గాంధీ 150వ జయంతి సందర్భంగా నిమిషానికి ఒక గాంధీ బొమ్మ చొప్పున 150 నిమిషాల్లో 150 బొమ్మలు, 156వ జయంతి సందర్భంగా టెంకాయపై 156 గాంధీ బొమ్మలు వేశారు. కరోనా సమయంలో ప్రజలను చైతన్యం చేయడానికి రోజుకో బొమ్మ చొప్పున 300 బొమ్మలు వేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఏకధాటిగా గంటల తరబడి చిత్రాలు వేయడం, నాలికతో పెయింటింగ్ చేయడం, నాలికపై పెయింటింగ్ చేసుకోవడం ఇలా విభిన్నమైన రీతుల్లో పెయింటింగ్‌లు వేస్తున్న నరహరి గిన్నిస్ రికార్డు కోసం ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు.



55 రకాల వస్తువులపై సీఎం రేవంత్‌రెడ్డి బొమ్మలు



చిత్రకారుడు నరహరి

రండి.. రండి..రండి
దయచేయండి

» హోటళ్లకు దిక్సూచిలా విజిల్ బ్లోయర్స్ » మెడలో విజిల్...చేతిలో లాఠీ, లైటర్లు



ఓ హోటల్ ఎదుట విజిల్ ఊదుతూ వాహనదారులను ఆహ్వానిస్తున్న ఉద్యోగి

హోటళ్ల గిరాకీకి రుచి, శుచి, భవన ఆకర్షణతో పాటు ఆహ్వాన తీరు ముఖ్యమే. ప్రస్తుతం హోటల్స్ రంగంలో పోటీ పెరిగింది. దూరప్రాంతాలకు వెళ్లే వారు రహదారుల వెంట హోటల్స్ బోర్డులను గమనిస్తూ వెళ్తుంటారు. ఈ క్రమంలో వారిని రండి.. రండి.. దయచేయండి అంటూ విజిల్ వేసి ఆహ్వానించే సిబ్బందికి ప్రాధాన్యం పెరిగింది. ప్రతీ హోటల్ వద్ద ఒక చేతితో వెల్‌కం సిగ్నల్ చూపిస్తూ విధులు నిర్వర్తించే పార్కింగ్ బాయ్స్(విజిల్ బ్లోయర్స్) కనిపిస్తుంటారు. వ్యాపార లావాదేవీలు పెరిగేందుకు హోటల్ యజమానులు వీరిని తప్పక నియమిస్తున్నారు. రహదారిపై ధుమ్ము, ధూళితో పాటు అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకుని నిలబడుతూ విధులు నిర్వర్తిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

హోటళ్ల ఎదురుగా నిలబడి విజిల్ వేస్తూ వాహనదారులను పిలిచే పార్కింగ్ బాయ్స్ ప్రకృతితో సహవాసంచేస్తారు.చలి, ఎండా, వాన అని లేకుండా సమయానికి హోటల్ ఎదురుగా రోడ్డుపై నిలబడి ఓచేత్తో విజిల్ వేస్తూ, మరో చేత్తో ఆహ్వానిస్తుంటారు. వీరి ద్వారానే అక్కడ హోటల్ ఉందని ఉందని తెలుసుకుని వేగాన్ని నెమ్మదించి హోటల్‌కు వస్తుంటారు. వాహనదారులను ఆహ్వానించడమే కాదు వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేయిస్తూ తోటి వాహనదారులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలను పరిశీలిస్తారు. వేసవిలో సూరీడు సెగలు కక్కుతున్నా, గజగజ వణికించే చలి అయినా ముసురు కమ్మేసినా గంటల తరబడి కుటుంబం కోసం నిలబడతారు. ప్రకృతి ప్రకోపాన్ని కూడా లెక్కచేయరు.

భోజనానికి విరామం లేని సమయం

హోటల్ యజమానితో పాటు అందులో పనిచేసే వివిధ విభాగాల సిబ్బంది, పార్కింగ్ బాయ్స్ కూడా ఇక భోజన సమయం దాటిపోయిందన్న తర్వాతే భోజనం చేస్తారు. భోజన సమయం దాటిపోయిందనుకున్న తర్వాత, హోటళ్లకు ప్రయాణికుల రాక తగ్గాకే తింటారు. సమయానికి భోజనం చేస్తే కొందరు యజమానులు కోపగించుకుంటారు. కొందరు చూసీ చూడనట్లు వదిలేస్తుంటారు. అయితే హోటల్ యజమాని కోపంలో అర్థం ఉందిలే అని పార్కింగ్ బాయ్స్ చెబుతూ సర్దుకుంటారు.


వయసు మళ్లిన వారే ఎక్కువ

హోటళ్ల వద్ద పార్కింగ్ బాయ్స్ విధుల్లో ఐదుపదుల వయసు దాటిన వారే ఎక్కువగా ఉంటారు. ఇంట్లో ఖాళీగా కూర్చోలేక కుటుంబ సభ్యులపై ఆధారపడలేక తప్పనిసరి పరిస్థితుల్లో శారీరకంగా బరువులు ఎత్తలేని స్థితిలో ఉన్నవారే ఈ ఉద్యోగాన్ని ఎంచుకుంటున్నారు. ప్రదేశం, వ్యాపారం, శ్రమను బట్టి వారికి రోజువారి వేతనం అందుతుంది.

ఎయిర్ డ్యాన్సర్ బెలూన్ టాయిస్ ఉన్నా

జాతీయ రహదారులపై కొత్తగా ఏర్పాటవుతున్న హోటళ్లు వాహనదారులను ఆహ్వానించేలా, ఆకర్షించేలా,పార్కింగ్ బాయ్స్ స్థానంలో వివిధ ఆకారాల్లో ఉండే ఎయిర్ డ్యాన్సర్ వెల్‌కం బెలూన్(హోటల్) టాయిస్‌ను ఏర్పాటుచేస్తున్నారు. కనీసం ఐదు ఫీట్ల ఎత్తు ఉండే ఈ టాయిస్ గాలి ఆధారితంగా పనిచేస్తాయి.చేతిని మడిచి చాపి ఇలా హోటల్‌లకు వాహనదారులను పిలిచేలా ఉంటుంది. కానీ అవి కేవలం ఆహ్వానించడానికే పనికొస్తాయి. కానీ పార్కింగ్ బాయ్స్ మాత్రం వాహనాల పార్కింగ్ రక్షణను కూడా పర్యవేక్షించే అవకాశమున్నందున టాయిస్‌లు ఉన్నా పార్కింగ్ బాయ్స్‌లను పనిలో పెట్టుకుంటున్నారు.

ఉద్యోగం నాకు కొత్త అనుభవమే



మడిగె అద్దెకు తీసుకుని చిన్న బట్టల దుకాణాల్లో నీడపట్టున ఏళ్ల తరబడి వ్యాపారం చేసినా. నాకు ఎండ, వానకు ఓర్చుకుంటూ హోటల్ వద్ద పనిచేయడం కొత్త అనుభవమే. చిట్యాల రోడ్డు విస్తరణలో బట్టల దుకాణం కోల్పోవడంతో ఖాళీగా కూర్చోలేక ఈ పనిలో కుదిరా. వయసు రీత్యా ఇతర పనులకు వెళ్లలేక చేస్తున్నా. హోటల్ నిర్వాహకులు మంచిగానే చూసుకుంటారు. కుటుంబ పోషణ కోసం చేస్తున్నా.

- మామిడి వెంకన్న, చిట్యాల

వెరికోస్ సమస్యలు వచ్చే అవకాశం



కొన్నేళ్ల పాటు గంటల తరబడి నిలబడి పనిచేయడం, దుమ్ముకు నిరంతరం గురికావడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. ప్రధానంగా పెరిఫెరల్ ఆర్టెరీల్ డిసీస్, వెరికోస్ వెయిన్స్ సమస్య, ఊపిరితిత్తుల సమస్య వచ్చే అవకాశం ఎక్కువ. మాస్టర్‌చెఫ్‌లు, టీస్టాల్‌లో టీ తయారు చేసే వారికి, ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు ఎక్కువగా వెరికోస్ సమస్య వచ్చే అవకాశముంది. ఈ సమస్యను అధిగమించాలంటే ఒకే చోట గంటల తరబడి నిలబడకుండా మధ్యలో కొద్దిసమయమైనా కూర్చోవాలి. ఫేస్ మాస్క్ ధరించి గొడుగు కింద నిలబడటం ద్వారా సమస్యను కొంతైనా తగ్గించుకోవచ్చు.

- డాక్టర్ ఏఎస్‌కే మనోజ్, ఎండీ, జనరల్ మెడిసిన్, కిమ్స్, నార్కట్‌పల్లి

ఎనిమిది గంటలు నిలబడాల్సిందే

మాది నకిరేకల్ మండలం గుడివాడ. కూలీనాలీ చేసుకుంటూ గ్రామంలోనే ఉండేవాన్ని. వయసు రీత్యా బరువులు ఎత్తే పనులకు వెళ్లడానికి ఆరోగ్యం సహకరించడం లేదు. దీంతో ఈ హోటల్ వద్ద వాహనాలను పిలిచే గార్డ్‌గా పని చేస్తున్నా. ఉదయం 6 గంటలకు వస్తే సాయంత్రం 5 గంటల వరకు డ్యూటీ చేయాలి. రెండు పూటలా అల్పాహారం, భోజనం పెడతారు. నికరంగా 8 గంటల పాటు నిలబడాల్సి వస్తుంది. కాళ్ల నొప్పి పుడుతున్నాయి. కానీ పొట్టకూటి కోసం తప్పటం లేదు.

సారా తయారీ బెల్లం పట్టివేత

చివ్వెంల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం, పటికను ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా కేంద్రం నుంచి సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని కూడలి, గోపతండా గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు అక్రమంగా నాటుసారా తయారీకి ఉపయోగించే 17 క్వింటాళ్ల బెల్లం, 10 కిలోల పటికను ఓ వాహనంలో తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం అందింది. మండలంలోని దురాజ్‌పల్లి వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు. నల్లగొండ ఎక్సైజ్ సహాయ కమిషనర్ సంతోష్ ఆదేశాలతో తనిఖీలు చేపట్టి వారిని పట్టుకొని సూర్యాపేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో హాజరు పరిచారు. నిందితులను విచారించగా అదే గ్రామాలకు చెందిన మరో నలుగురి ప్రమేయం ఉన్నట్లు వారు వెల్లడించారు. మొత్తంగా ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. బెల్లం, పటిక, వాహనాన్ని సీజ్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం సీఐ జీ వెంకటేశ్వర్లు, ఎస్ఐ గోపాలరావు, హెడ్‌కానిస్టేబుల్ అప్సర్‌అలీ, కానిస్టేబుళ్లు బ్రహ్మం, రమేశ్, ప్రశాంత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భువనగిరిలో గడువు మీరిన, నాణ్యత లేని బీర్లు

భువనగిరి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత మద్యం దుకాణాల లైసెన్స్ గడువు ఈ నెల 30తో ముగుస్తుండగా నూతన లైసెన్స్ డిసెంబరు ఒకటి నుంచి అమలులోకి రానుంది. అయితే వచ్చే రెండేళ్లకు లైసెన్స్ జారీ అక్టోబరు 10న నిర్వహించిన లాటరీలో దక్కని కొద్దిమంది ప్రస్తుత మద్యం దుకాణాల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు అనుగుణంగా శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరిలోని ఓ మద్యం దుకాణంలో గడువు మీరిన, నాణ్యతలేని బీర్ల విక్రయాలు అనుమానాలకు దారితీసింది. ఫిర్యాదులు అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఆరోపణలు వచ్చిన దుకాణంలో తనిఖీలు చేసింది. అలాగే ఈ తరహాలోని మరికొన్ని దుకాణాల్లో నకిలీ మద్యం విక్రయిస్తున్నట్లు కూడా ఆరోపణలు వస్తున్నాయి.

ఎందుకిలా..

మద్యం వ్యాపారం లాభసాటిగా మారడంతో దరఖాస్తు ఫీజు పెంచినా ఔత్సాహికులు వెనుకంజ వేయడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 82 మద్యం దుకాణాలకు 2,776 దరఖాస్తులు రాగా ఫీజు రూపేనా ప్రభుత్వానికి రూ.83.28 కోట్ల ఆదాయం లభించింది. అయితే 10 అక్టోబరున నిర్వహించిన లాటరీలో ప్రస్తుతం నిర్వహిస్తున్న చాలామందికి మరోసారి అవకాశం రాలేదు. ఆశించినస్థాయిలో దుకాణాలు రాకపోవడం, కోరుకున్న దుకాణాలు లభించకపోవడం, మరికొద్ది మందికి అసలే లైసెన్సులు దక్కకపోవడంతో దరఖాస్తు డబ్బులు భారీ మొత్తంలో నష్టపోయారు. దీంతో మద్యం వ్యాపారం నుంచి రెండేళ్ల వరకు తప్పుకోవాల్సి రావడం, టెండర్ దరఖాస్తు ఫీజురూపంలో జరిగిన నష్టంలో కొంతైనా రాబట్టేందుకు అక్రమాలకు తెర లేపుతున్నట్లు పలువురు భావిస్తున్నారు.



భువనగిరి సితార వైన్స్‌లో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్

భువనగిరిలో..

జిల్లా కేంద్రం భువనగిరిలోనే గడువు మీరిన, నాణ్యతలేని బీర్ల విక్రయాలు సాగుతున్నట్లు వెలుగుచూసింది. శనివారం ఓ మద్యం ప్రియుడు తనకు నచ్చిన బ్రాండ్ బీరు పట్టణంలోని ఓ వైన్స్‌లో కొనుక్కుని ఇంటికి వెళ్లగా ఆ బీర్ల ఎక్స్పైరీ తేదీ అక్టోబరు 16అని ఉంది. దీంతో అతను ఆ దుకాణానికి వెళ్లి నిలదీయగా డిపో నుంచి వచ్చినవే విక్రయిస్తున్నామని, ఇందులో తమ తప్పేమి లేదని బుకాయించే ప్రయత్నం చేశారు. అదే వైన్స్‌లో మరో కొనుగోలుదారుడికి నాణ్యతలేని బీరు వచ్చింది. దీంతో వారి ఫిర్యాదుల మేరకు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం ఆ వైన్స్‌లో తనిఖీలు చేసింది. అలాగే జిల్లాలోని మరికొన్ని దుకాణాల్లో కల్తీ, ఎన్‌డీపీ మద్యం విక్రయిస్తున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. నూతన లైసెన్స్ అమలులోకి వచ్చే వరకైనా అధికారులు, మద్యం ప్రియులు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆరోగ్య కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

నిరంతరం తనిఖీలు



జిల్లాలోని వైన్స్, బార్లలో నిరంతర తనిఖీలు చేస్తున్నాం. సీసీ కెమెరాలు కూడా ఉన్నాయి. గడువు మీరిన, కల్తీ, ఎన్‌డీపీ బీర్లు, మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. లైసెన్స్ గడువుతో నిమిత్తం లేకుండా తనిఖీలు, చర్యలు నిరంతరాయంగా ఉంటాయి. భువనగిరి సితార వైన్స్‌పై వచ్చిన ఫిర్యాదుల మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేసింది. మద్యం విక్రయాలు, నాణ్యతపై అనుమానాలు ఉంటే ఎక్సైజ్ శాఖకు సమాచారం, ఫిర్యాదు చేయవచ్చు.

విష్ణుమూర్తి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

షార్ట్‌సర్క్యూట్‌తో క్లినిక్ దగ్ధం

నార్కట్‌పల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌కు గురై ఓ క్లినిక్ దగ్ధమైంది. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల విలువైన ఆస్తి నష్టం వాటిల్లింది. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ అగ్నిప్రమాదం ఘటన గురించి బాధిత కుటుంబ సభ్యుల ద్వారా తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన తాడోజు శంకర్ గ్రామీణ వైద్యుడిగా సేవలు అందిస్తున్నాడు. తన ఇంటికి అతి సమీపంలోనే ఓ రేకుల షెడ్డు వేసుకుని వైద్య చికిత్స అందిస్తున్నాడు. శనివారం కూడా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్లినిక్‌కు వచ్చిన రోగులను పరీక్షించి భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లాడు. అదేసమయంలో క్లినిక్ నుంచి పొగలు రావడంతో స్థానికులు సమాచారం అందించారు. స్థానికులు నీళ్లు చల్లి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈలోగా ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పివేశారు. అగ్నిప్రమాదంలో వస్తువులన్నీ బూడిదై రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

భువనగిరి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మండలం తుక్కాపురం గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన పాడి రైతు రాసాల వీరయ్యకు చెందిన గేదె పొలం గట్టుపై గడ్డి మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. గేదె విలువ రూ. 1.70 లక్షలు ఉంటుందని, తమ కుటుంబం వీధిన పడిందని ప్రభుత్వం పరిహారం అందచేసి ఆదుకోవాలని రైతు కోరారు.

హోటల్‌లోకి దూసుకొచ్చిన కంటైనర్



హోటల్‌లోకి దూసుకెళ్లిన కంటైనర్

హుజూర్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో కంటైనర్ అదుపుతప్పి హోటల్‌లోకి దూసుకెళ్లింది. శుక్రవారం రాత్రి కోదాడ నుంచి మిర్యాలగూడ వైపు బూడిదలోడ్‌తో వెళ్తున్న కంటైనర్ పట్టణంలోని ఇందిరా సెంటర్‌లో మలుపు వద్ద అదుపు తప్పింది. దీంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో అది విరిగి హోటల్‌లోకి దూసుకెళ్లింది. దీంతో హోటల్ నిర్వాహకులు భయభ్రాంతులకు గురయ్యారు. స్తంభం అడ్డంగా ఉండడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్తంభం విరిగి మంటలు చెలరేగాయి. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. భారీ వాహనాలకు ప్రవేశం లేకున్నా రాత్రి వేళ టౌన్‌లోకి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయిని స్థానికులు తెలిపారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. విద్యుత్ ఏఈ రామప్రసాద్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ బండిమోహన్ తెలిపారు.

మూసీ నదిలో బాలిక గల్లంతు

నేరేడుచర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సరదాగా మట్టితో చేసిన వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలో వెళ్లి మూసీనదిలోకి వెళ్లిన బాలిక గల్లంతైంది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సోమారం గ్రామానికి చెందిన కొమ్రరాజు కృష్ణయ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చిన్నకుమార్తె సుశ్మిత(13) సోమారం గ్రామంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. శనివారం పాఠశాలకు సెలవు ఉండటంతో ఇంటి వద్దే ఉంది. సరదాగా మట్టి గణపతిని తయారుచేసింది. ఆ గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు సోమప్ప దేవాలయం వద్దకు నాలుగోతరగతి చదువుతున్న దీక్షిత, అశ్వినితో కలిసి సోమప్పదేవాలయం పక్కన ఉన్న మూసీ నది వద్దకు వచ్చింది. విగ్రహాన్ని నిమజ్జనం చేయాలని నీటిలోకి దిగడంతో వరద ఉధృతికి సుశ్మిత కొట్టుకుపోయింది. వెంటనే అక్కడ ఉన్న చిన్నారులు బయటకు వచ్చి కేకలు వేయడంతో పరిసర ప్రాంత రైతులు వచ్చి ప్రయత్నించినా ఆచూకీ లభించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రిస్క్యూ టీంను, జాలర్ల చేత వెతికిస్తున్నారు. సుశ్మిత ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలు ఎవరూ మూసీ నదిలోకి దిగవద్దని వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కోరారు. గల్లంతైన బాలిక ఆచూకీ లభిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు.



సుశ్మిత



బాలిక గల్లంతైన కృష్ణానది పరివాహకం వద్ద పోలీసులు, గజ ఈతగాళ్లు

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి



వెంకటేష్‌గౌడ్(ఫైల్)

మర్రిగూడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అజిలాపురం గ్రామానికి చెందిన మాదగోని వెంకటేష్‌గౌడ్(38) రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మాల్ గ్రామం వద్ద సొంత ఇంటి నిర్మాణాన్ని చేపట్టారు. అయితే శనివారం ఉదయం ఇంటికి నీళ్లు కొట్టుతున్నాడు. దీంతో అతి సమీపంలోని 11కేవీ విద్యుత్ తీగలపై నీరు పడి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వెంకటేష్‌గౌడ్‌కు భార్య లక్ష్మీదేవి, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

సాగర్‌లో 145 గ్రాముల గంజాయి పట్టివేత

నాగార్జునసాగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఓ వ్యక్తి వద్ద 145 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనునాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిల్‌కాలనీ ఆఫీసర్స్ క్లబ్ వెనక ఓ వ్యక్తి గంజాయి తాగుతున్నాడనే సమాచారంతో తమ సిబ్బందితో వెళ్లి పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. విచారణలో ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన బొడ్డు విక్రం(21)గా గుర్తించామని, అతడి వద్ద 145 గ్రాముల గంజాయి, గంజాయిని తాగడానికి ఉపయోగించే బంగుతో పాటు ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి నిడమనూరు కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మత్తు పదార్థ విక్రయదారుల అరెస్ట్

మిర్యాలగూడ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలు విక్రయిస్తున్న నిందితులను అరెస్ట్ చేసినట్లు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపారు. శనివారం వన్‌టౌన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు ఈదులగూడ చౌరస్తాలో చేతిలో కవర్లతో అనుమానాస్పదంగా కనిపించగా, విచారించామన్నారు. వారిని పట్టణంలోని సీతారాంపురానికి చెందిన మచ్చ నవీన్, నక్క మహేష్‌లు గుర్తించామన్నారు. ఇరువులు మత్తు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కారంపుడికి చెందిన వీరభద్ర మెడికల్ హాల్‌లో మత్తు ట్యాబ్లెట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొంతకాలంగా మత్తు ట్యాబ్లెట్లు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మత్తు మందులు కొనుగోలు చేసిన నవీన్, మహేష్‌లను అరెస్ట్ చేశామన్నారు. వారికి ఎటువంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా ట్యాబ్లెట్లను విక్రయించిన కారంపుడికి చెందిన మెడికల్ షాపు నిర్వాహకులు శెట్టి హనుమంతరావు, శెట్టి జయరామచంద్రప్రసాద్‌లపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారుల అనుమతి కోరి వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుల వద్ద ఉన్నవాటితో పాటు మెడికల్ షాపులోని మత్తు ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు సదరు దుకాణాన్ని సీజ్ చేశామన్నారు. మత్తు పదార్థాల కేసును ఛేదించిన సీఐ నాగభూషణం, ఎస్ఐ సైదిరెడ్డి, సిబ్బంది రాజారామ్, వీరబాబు, నర్సింహ, ప్రసాద్, శ్రీను, హుస్సేన్‌లను డీఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

ప్రాణాలు విలువైనవి, పోగొట్టుకోవద్దు

- బీబీనగర్ చెరువు వద్ద సామాజిక కార్యకర్త ఫ్లెక్సీలు
- వరుస ఆత్మహత్యల ఘటనల నేపథ్యంలో వినూత్న ప్రయత్నం

బీబీనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ చెరువులో ఆత్మహత్య నివారణకు ఓ సామాజిక వినూత్నంగా ప్రయత్నించారు. సెప్టెంబరు నుంచి నవంబరు 3 వరకు ఐదుగురు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ నేపథ్యంలో చలించిపోయిన పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త టైగర్ చారిట్రబుల్ ట్రస్టు నిర్వాహకులు పంజాల సురేశ్‌గౌడ్ చెరువు వద్దకు వచ్చే వారిలో ఆలోచనలు రేకెత్తించేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. చెరువు ఆహ్లాదం మాటున ప్రమాదం ఉందని, ప్రాణాలు తీసుకుని చెరువును అపవిత్రం చేయవద్దని పేర్కొంటూ ఓ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అదేవిధంగా జీవితం అమూల్యం- చెరువులో ఈతకు దిగి ప్రాణాలు కోల్పోవద్దు, ఒక్క క్షణం జాగ్రత్త, జీవితాంతం రక్షణ అంటూ మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇలా అనేకరకాల సందేశాత్మక సూక్తులతో హెచ్చరిస్తు అప్రమత్తం చేస్తున్న తీరు అందరిని ఆకర్షిస్తు ఆలోచింపచేస్తుంది. ఆయన ప్రయత్నాన్ని అందరూ బినందిస్తున్నారు.



బీబీనగర్ చెరువు వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు

ప్రమాదం అంచున ..

నేటి యువత సెల్ఫీలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. అపాయమని తెలిసినా సెల్ఫీలు, ఫొటోలు దిగుతున్నారు. శనివారం ఉదయం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ బైపాస్ సర్వీస్ రోడ్డును ఆనుకుని ఉన్న చెరువు వద్ద కొందరి యువకులు హల్‌చల్ చేశారు. చెరువులోకి వాహనాలు దూసుకుపోకుండా ఏర్పాటుచేసిన ఐరన్ బీమ్‌లపై నిలబడి ఫొటోలు దిగారు. ఏ మాత్రం అదుపుతప్పినా అందరూ చెరువులో పడిపోయే ప్రమాదం ఉంది. అయినా ఫొటోలకే ప్రాధాన్యమిచ్చారు.

(ఆంధ్రజ్యోతి-బీబీనగర్)



మితంగా తింటే... ఆహారం

సండే ఫోకస్

● మెరుగైన జీవన విధానం.. మారుతున్నశైలి
● ఒక్కొక్కరిదీ ఒక్కో విధానం
● పర్యవేక్షణ అవసరమంటున్న నిపుణులు



జీవనశైలి మార్పులతో..

ఆరోగ్యంపట్ల అవగాహన, ఆహారంపట్ల అప్రమత్తత పెరుగుతున్న తరుణంలో పాత విధానాలు, పురాతన అలవాట్లు మానవ జీవితంలోకి పునఃప్రవేశిస్తున్నాయి. షుగర్, బీపీ, థైరాయిడ్ తదితర దీర్ఘ కాలిక వ్యాధులతోపాటు హార్ట్ ఎటాక్, బ్రెయిన్ ఎటాక్, క్యాన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధులనుంచి రక్షణ పొందేందుకు ప్రజలు. జీవనశైలిలో మార్పులు చేసుకుంటున్నారు. కొందరు తమ శారీరక ఇబ్బందులకు తగినట్లు తీసుకునే ఆహారంలో స్వీయమార్పులు చేసుకుంటుండగా, మరికొందరు వైద్యుల సలహాల మేరకు ఆహారంలో మార్పులు చేసుకుంటున్నారు. సంపన్నవర్గాలకు చెందిన వారైతే డైటీషియన్లను సంప్రదిస్తూ.. వారు సూచించిన మెనూ తూచాతప్పకుండా పాటిస్తున్నారు.

ఆహారమంటే పోషకాల సమతుల్యం. శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వులను అందించి, జీవక్రియలు సక్రమంగా జరిగేందుకు దోహదపడుతుంది.శక్తిని సమకూర్చుకోవడంతోపాటు వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు పౌష్టికాహారం పాత్ర కీలకం.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

ప్రాంతాలను బట్టి అలవాట్లు

జీవ వైవిధ్యానికి అనుగుణంగా, ప్రాంతాలను బట్టి, ఆయా చోట్ల లభ్యమయ్యే ఉత్పత్తులను బట్టి ఆహారపు అలవాట్లుంటాయి. సంస్కృతీ, సంప్రదాయాలకు అనుగుణంగా తీసుకునే ఆహారంలో తత్వాల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న జనం మార్పులు, చేర్పులు చేసుకుంటున్నారు. ప్రధానంగా కరోనా కాలం నుంచి ఆహారపు అలవాట్లలో చెప్పుకోదగిన మార్పులు వచ్చాయన్నది ఎవరూ కాదనలేని నిజం.

వెజ్, నాన్‌వెజ్‌తోపాటు..

ఆహారమంటే ఒకప్పుడు రెండే రకాలుగా ఉన్నట్లు వినేవాళ్లం. వెజ్, నాన్‌వెజ్ అని మాత్రమే. అయితే వెజ్, నాన్‌వెజ్ వంటకాలతోపాటు పలు రకాల ఆహార పదార్థాలు, విధానాలు అందుబాటులోకి వచ్చాయి. పెరుగుతున్న వ్యాధులు, మారుతున్న జీవనశైలికి అనుగుణంగా తీసుకునే ఆహారంలో వచ్చిన మార్పులతో చాలారకాల పేర్లు వినిపిస్తున్నాయిప్పుడు. వాటిలో ప్రధానంగా వినిపించేవి ప్లాంట్ బేస్డ్ ఫుడ్, ప్రొటీన్ రిచ్ ఫుడ్, కీటో డైట్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ ఫుడ్, జీరో వేస్ట్ ఫుడ్, సస్టైన్డ్ ఫుడ్, వీగన్ డైట్, ఫెర్మెంటెడ్ ఫుడ్, పాలియో డైట్ తదితరాలున్నాయి.



ప్రకృతి వైద్య నిపుణలేమంటున్నారంటే..

మాంసంలోనే మాంసకృతులు ఉంటాయన్నది నిజం కాదంటున్నారు ప్రకృతి వైద్య నిపుణులు. పప్పు, పండ్లు, చిరుధాన్యాలలో కూడా మాంసకృతులు సమృద్ధిగా ఉంటాయని, మనుషుల కంటే ఎక్కువ కష్టం చేసే జంతువులు తీసుకునే ఆహారం పచ్చిదేనని, ప్రకృతి నుంచి మొక్కలు, కాయల రూపంలో నేరుగా వాటి కడుపులోకి వెళ్తుందంటున్నారు. పాల పదార్థాలు జంతు ఆహారంతో సమానమని, అలాంటి ఆహారం మంచి కన్నా చెడే ఎక్కువ చేస్తుందనే వాదనలు ఇటీవల కాలంలో సోషల్ మీడియా వేదికపై వినిపిస్తున్నాయి.

శరీరానికి సర్వీసింగ్

వీగనిజానిది ప్రత్యేక స్థానం



వీగనిజం.. అంటే జంతు అవశేషాలు లేని ఆహారం. శాఖాహార జీవన విధానమని అంటారు. అయితే శాఖాహారంలోనూ అన్నీ తినరు. జంతువుల నుంచి వచ్చే (ఉత్పత్తియ్యే) పదార్థాలను తీసుకోరన్నమాట. అంటే పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చీజ్, పన్నీరు, కోడి గుడ్లు తదితర ఆహార పదార్థాలకు దూరంగా ఉంటారు. ఇక అలాంటి ఆహారం తీసుకునే వారిని 'వీగన్లు' అని అంటారు. ఇదేమీ కొత్త పదం కాకపోగా, అలాంటి ఆహారం తీసుకునే విధానమూ సరికొత్తది కాదు.

అవసరమంటూ..

బైకులు, కార్లకు సర్వీసింగ్ చేయిస్తున్న విధంగానే.. మానవ శరీరానికీ సర్వీసింగ్ అవసరమంటున్నారు వైద్యులు. అంతేగాక ఒకేసారి ఆహార నియంత్రణ, నియమాలు ఆచరించడం సాధ్యం కాదని, అందుకే అలా ఆశ్రమాలు, ప్రకృతి చికిత్స శిబిరాలకు వెళ్తున్నారు. ఆయా ఆశ్రమాల్లో దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందించడం తోపాటు వ్యాయామం, యోగా, ధ్యానసాధనపై అవగాహన కల్పించడంతోపాటు ఆహార నియమాలు అలవరుస్తున్నారు.

జంతు సంక్షేమాన్ని కాంక్షించే వారు..

శాఖాహారంతోపాటు నియమిత ఆహారపు అలవాట్లను ఆచరించే వారిలో యానిమల్ లవర్స్ ఎక్కువగా ఉన్నట్లు పలు పరిశోధనలు పేర్కొన్నాయి. జంతు సంక్షేమాన్ని కాంక్షించే వారు సాఫ్ట్ డైట్‌ను ఫాలో అవుతున్నారు. ఆధ్యాత్మిక గురువులు, సాధువులు కాకుండా సాధారణ జీవనం సాగించే వారే ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు. ప్రకృతిని ప్రేమించేలా, జంతురక్షణకు కట్టుబడి ఉండేలా ఆహారపు అలవాట్లుండాలని అభిప్రాయాలు ఇటీవల కాలంలో వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ తరహా ఆలోచనలు చేసే వారిలో యువతే అధికంగా ఉండటం గమనార్హం.

ఆహారం మాత్రమే కాదు సుమా..

మారుతున్న ఆహారపు అలవాట్లు అక్కడికే పరిమితం కాకుండా అంతకుమించి ఉంటున్నాయి. అంటే.. మాంసాహారానికి అతి దూరంగా ఉంటూ శాఖాహారంలోనూ ఎంపిక చేసుకున్న ఆహారాన్నే భుజించే వారు ఇతర విషయాల్లోనే అప్రమత్తంగా ఉంటున్నారు. జంతు అవశేషాల తో ఉత్పత్తి చేసే వస్తువులను వినియోగించేందుకు అస్సలు ఇష్టపడటం లేదు. జంతు చర్మాలు, అవశేషాలతో తయారు చేసిన దుస్తులు, అలంకరణలు బ్యాగులు, బెల్టులు, పాదరక్షలు వినియోగించకపోవడం విశేషం.

అలా.. ఇలా.. అంటూ...


ఆహార నియమాలు పాటించాలని, ఆరోగ్య సూత్రాలు ఆచరించాలని అందరికీ ఉంటుంది. అయితే ఎలా ఫాలో అవ్వాలో అయోమయంగానూ ఉంటుంది. అల్లోపతి, నేచరోపతి, హోమియోపతి.. ఇలా పలురకాల వైద్యవిధానాలున్నాయి. ఆధునిక శాస్త్రీయ వైద్యం అందించడాన్ని అల్లోపతి అని, సహజసిద్ధమైన ఆరోగ్య చికిత్సను అందించే తీరను నేచరోపతి అని, ప్రత్యామ్నాయ వైద్యాన్ని అందించే విధానాన్ని హోమియోపతి అంటుంటాం. వైద్య విధానాల్లో రకాలున్నట్లుగానే.. ఆహార నియమాలు అందించే విధానాల్లోనే రకాలున్నాయి. ఒకరు ఉప్పు కారం వద్దంటారు. ఇంకొకరు కొబ్బరి నూనెతో చేసిన ఆహారాన్ని తీసుకోమంటారు. మరొకరు మాంసాహారం ముట్టొద్దంటారు. ఏది తిన్నా ఏమీ కాదు.. కాకుంటే మితంగా తినాలంటున్నారు మరికొందరు వైద్యులు. ఇక ఇంటర్మీడియట్ ఫాస్టింగ్ అని, వన్ డే వన్ మీల్ అని, లిక్విడ్ డైట్ అని.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలనే ఉన్నాయి.

సాఫ్ట్ డైట్‌తో సాఫీగా..

సాఫ్ట్ డైట్‌తో జీవితం సాఫీగా సాగుతుందంటున్నారు వైద్య నిపుణులు. గుండె జబ్బులు రావని, టైప్ టు మధుమేహం, కొలస్ట్రాల్, క్యాన్సర్ తదితర ప్రమాదకర వ్యాధులు దరిచేరవట. మొక్కలు, విత్తనాల ఆధారిత ఆహారంలో ఫైబర్, యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయని, జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. ఇక మూడ్ స్వింగ్స్‌లో మార్పులు, డిప్రెషన్ తగ్గించడంలో ప్లాంట్ బేస్డ్ ఫుడ్ బెటరంటున్నారు.

స్వీయ నిర్ణయాలు వద్దంటూ..

ఆహారపు అలవాట్లలో మార్పులు ఆహ్వానించదగిన పరిణామమే అంటున్నారు నిపుణులు. అయితే కొన్ని రకాల డైట్లు స్వయంగా ఫాలో అవ్వొద్దని వారిస్తున్నారు. ఉప్పు, కారం, మసాలాలు, నూనె తక్కువ చేస్తే నష్టమేమీ లేదని, డైటింగ్ పేరుతో అన్నీ ఏకంగా మానేస్తే శరీరం సహకరించదంటున్నారు. పోషకాహార నిపుణుల ప్రమేయం, సలహా లేకుండా ఆహార నియమాలు పాటిస్తే ప్రమాదమంటున్నారు కొందరు డాక్టర్లు. ఇక వీగన్ డైట్‌లో విటమిన్ బీ 12 అసలుండదని, జంతు ఆధారిత ఆహారాల్లోనే ఉండే కాల్షియం, ఐరన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు వీగన్ డైట్ తీసుకునే వారికి అందకపోవచ్చని మరికొందరు వైద్యులంటున్నారు. సరిగా ప్రిపేర్ చేయని సాఫ్ట్/వీగన్ డైట్‌తో పోషకాహారలోపం రావొచ్చని, ఆరోగ్య సమస్యలున్న వారు సదరు డైట్‌ను ప్రారంభించే ముందు డైటీషియన్ల సలహా తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు.



నిపుణుల సలహా తప్పనిసరి



సాఫ్ట్ డైట్ తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిది. అయితే చిన్నప్పటి నుంచి అలవాటు ప్రకారం తీసుకునే ఆహారాన్ని కొద్ది కొద్దిగా తగ్గిస్తూ వైద్యులు సూచించిన డైట్‌లోకి మారాలి. ఎవరికి వారుగా సొంత మెనూ సిద్ధం చేసుకుని ఫాలో అయితే దుష్ప్రభావాలు కలుగుతాయి. గత ఆహారపు అలవాట్లను అనుగుణంగానే ఆహారంలో మార్పులు చేసుకోవాలి. స్పెషల్ డైట్ ఫాలో అవ్వాలనుకునే వారు ముందుగా తమ ఫ్యామిలీ డాక్టర్‌ను కలవాలి.

డాక్టర్ సరస్వతి, డైటీషియన్

మార్పులు, చేర్పులు అవసరం



మారుతున్న కాలం, పెరుగుతున్న వయసుకు అనుగుణంగా ఆహారపు అలవాట్లలో మార్పులు, చేర్పులు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రధానంగా మహిళలు ఆహార నియమాలు తప్పక పాటించాల్సిన అవసరముంది. పెళ్లి, పిల్లలు, సంసార బాధ్యతలతో మహిళలకు శారీరక, మానసిక మార్పులు కలుగుతాయి. వాటికి తగినట్లుగా ఆహార మార్పులు చేసుకుని పాటించాలి. ఒకేసారి డైట్ మొత్తాన్ని మార్చితే శరీరం తీసుకోలేదని గ్రహించాలి. వైద్యనిపుణుల సలహా తప్పనిసరిగా తీసుకోవాలి.

డాక్టర్ పీ. రమాదేవి, గైనకాలజిస్ట్, మిర్యాలగూడ.

నియంతలైనా గద్దె దిగాల్సిందే

● కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి ● ఎస్. వీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

రామన్నపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గం సంఘటితంగా తిరగబడితే ఎంతటి నియంతలైనా గద్దె దిగాల్సిందేనని ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా జరిగే పరిణామాలను చూస్తే అర్థమవుతుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన సీఐటీయూ జిల్లా నాలుగో మహాసభల్లో పాల్గొని మా ట్లాడారు. ప్రపంచాన్ని ఆయుధ సంపత్తితో శాసిస్తున్న అమెరికాలోని న్యూయార్క్ నగరంలో కార్మికుల పక్షపాతి, జోహ్రాన్ మమ్దాని విజయం, ఇటీవల శ్రీలంకలో జరిగిన ఎన్నికల్లో దిసనాయకే విజయం పెట్టుబడిదారులకు చెంపపెట్టు అని అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల హక్కులను బీజేపీ కాలరాస్తోందన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి భూపాల్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తెచ్చిన పని విధానాన్ని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని, కాంగ్రెస్‌కు బీజేపీలకు కార్మికుల విషయంలో తేడాలేదన్నారు. అనంతరం జిల్లా మహాసభలో జిల్లావ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యాచరణ తీర్మానాలు చేశారు. తొలుత అరుణపతాకాన్ని జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు ఆవిష్కరించగా, ప్రతినిధులు అమరవీరులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో కల్లూరి మల్లేశం, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గొరిగె సోములు, ఎండీ పాషా, చిలువేరు రమాకుమారి, దోనూరి నర్సిరెడ్డి, తుర్కపల్లి సురేందర్, బొడ్డుపల్లి వెంకటేశం, సుబ్బురు సత్యనారాయణ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో నిత్య పూజలు



ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు

భువనగిరి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భువనగిరి మండల పరిధిలోని స్వర్ణగిరిలో శనివారం నిత్య పూజలను ఘనంగా నిర్వహించారు. పద్మావతి అమ్మవారికి నవకలశ పంచామృత అభిషేకం జరిపారు. జల నారాయణ స్వామికి మంగళహారతులు సమర్పించారు. పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామికి నిత్య కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తుల గోవింద నామ స్మరణలతో కల్యాణమూర్తులకు తిరువీధి సేవ నిర్వహంచారు. 69వ చిన్మయ ఆధ్యాత్మిక వార్షిక సమావేశంలో పలువురు ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు. సెలవు రోజు కావడంతో భక్తుల రద్దీ పెరిగింది.

గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలి

● బీసీ గురుకులాల ఆర్‌సీవో స్వప్న ● సాగర్‌లో ముగిసిన అండర్-17 గురుకులాల క్రీడలు





నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్, యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేటలో బహుమతి ప్రదానం చేస్తున్న ఆర్‌సీవో స్వప్న, అధికారులు

నాగార్జునసాగర్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల ఆర్‌సీవో స్వప్న అన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ బీసీ గురుకుల పాఠశాలలో వారంరోజులపాటు జరిగిన క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో గురుకులాలకు ప్రాముఖ్యం పెరిగిందని, ప్రైవేటుకంటే బీసీ గురుకుల పాఠశాలల్లో చదవడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారన్నారు. గురుకులాల్లో చదివిన విద్యార్థులు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తారన్నారు. చదువుతోపాటు విద్యార్థులు ఏదో ఒక క్రీడలో పాల్గొనాలన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవికుమార్, ఏటీపీలు సంతోష్, సరిత, అరుణ, పీఈటీలు, వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట: రాజాపేట మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మూడు రోజులపాటు జరిగిన 11వ జోనల్ స్థాయి(బాలుర) క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలలో విద్యార్థులు ప్రతిభను చాటి బహుమతులను గెలుచుకున్నారు. అండర్-14, 17, 19 విభాగాల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను స్టేషన్ ఘణ్‌పూర్ విద్యార్థులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ అనిల్‌కుమార్, డీసీవో సుధాకర్, క్రీడల సమన్వయకర్త శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ వేణు పాల్గొన్నారు.

ఘనంగా సదర్ వేడుకలు

భువనగిరి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): యాదవులు సంప్రదాయ వృత్తిని కొనసాగిస్తూనే విద్యకు ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి భువనగిరిలో నిర్వహించిన సదర్ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఐక్యమత్యంగా ఉంటేనే రాజకీయ గుర్తింపు లభిస్తుందన్నారు. దున్నపోతుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముందుగా సాయిబాబా ఆలయం నుంచి జూనియర్ కళాశాల వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జీ క్యామ మల్లేశం, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాల్‌రాజ్‌యాదవ్, శ్రీకృష్ణయాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేశ్‌యాదవ్, నక్కల లక్ష్మీనారాయణ యాదవ్, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె ధనాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



భువనగిరిలో దున్నపోతుల విన్యాసాలు

బౌద్ధుల ఆరాధన క్షేత్రం.. సాగర్

● థాయ్‌లాండ్ బౌద్ధ భిక్షువులు



బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న బౌద్ధులు

నాగార్జునసాగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్ కాలనీలో 274 ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనం బౌద్ధులకు ఆరాధన క్షేత్రం అని థాయ్‌లాండ్ బౌద్ధ భిక్షువులు అన్నారు. థాయ్‌లాండ్‌కు చెందిన 12మంది బౌద్ధ భిక్షువులు శనివారం బుద్ధవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధవనంలో చరిత వనం, ధ్యాన వనం, జాతక వనంలను తిలకించారు. మహాస్థూపంలోపల ధ్యానమందిరంలో ధ్యానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుద్ధవనాన్ని అద్భుతంగా నిర్మించారన్నారు. భావితరాలకు బౌద్ధ వారసత్వాన్ని తెలియజేసేందుకు బుద్ధవనం ఒక గొప్ప అవకాశం అన్నారు. బుద్ధవనం విశేషాలను ఈవో శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, శిల్పి శ్యాంసుందర్ వివరించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ, ఎస్పీఎఫ్ ఆర్ఐ శ్రీనివాస్ రావు, రఘు, రతన జ్యోతే, తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి ఖిల్లాపై పర్యాటకుల సందడి



ఖిల్లా వద్ద పర్యాటకులు

భువనగిరి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భువనగిరి ఖిల్లాపై పర్యాటకుల సందడి నెలకొంది. రెండో శనివారం సెలవు రోజుకావడంతో హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, ఔత్సాహికులు వందలసంఖ్యలో ఖిల్లా సందర్శనకు బారులతీరారు. దీంతో ఖిల్లా అంతటా పర్యాటకులు సందడి చేయగా దిగువభాగంలో పదుల సంఖ్యలో బస్సులు, ఇతర వాహనాలు కిక్కిరిసాయి. ఖిల్లాపై అద్భుత కోటగోడ, ఇతర నిర్మాణాలను చూసి అబ్బురపోయారు. నిర్మాణ విశిష్టతను సెల్‌ఫోన్లు, కెమెరాలలో బంధించి సెల్ఫీలు దిగారు. టూరిజం గైడ్ వినోద్‌కుమార్ ఖిల్లా చరిత్రను వివరించారు. సందర్శకుల తాకిడితో ఒక్కరోజే పర్యాటక శాఖకు వేలాది రూపాయల ఆదాయం సమకూరింది.

భక్తజన సంద్రం.. యాదగిరిక్షేత్రం

● కిక్కిరిసిన ఆలయ పరిసరాలు ● క్యూలైన్లు, తిరువీధుల్లో భక్తుల కోలాహలం ● శాస్త్రోక్తంగా నృసింహుడికి నిత్య పూజలు



ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు





క్యూలైన్లలో భక్తుల రద్దీ, వ్రత మండపాన్ని పరిశీలిస్తున్న ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో రెండో శనివారం సెలవుదినం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు యాదగిరికొండకు తరలివచ్చారు. ఇష్టదైవాలను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో వాహనాలపై రాగా ఉభయ క్యూలైన్లు ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. రెండో శనివారం, ఆదివారం సెలవు దినం కలిసి రావడంతో సత్యదేవుడి వ్రతాలు, కార్తీక దీపాలు వెలిగించారు. వాహనాలతో కొండపైన, కొండకింద పార్కింగ్ ప్రదేశాలు నిండిపోగా టోల్‌గేట్ వద్ద బారులు తీరిన వాహనాలతో సుమారు అర్థ గంటపాటు కొండపైకి వెళ్లేందుకు వాహనదారులు వేచి ఉన్నారు. సుమారు 50వేల మంది భక్తులు వచ్చారు. ప్రత్యేక దర్శనం గంట, ధర్మదర్శనం రెండు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనం, మధ్యాహ్నం రాజభోగం (ఆరగింపు) సమయాల్లో మూడు గంటలపాటు ఉభయ క్యూలైన్లల్లో భక్తుల వేచి ఉన్నారు. కొండపైన ఆర్టీసీ ప్రాంగణం వాహనాల పార్కింగ్‌తో నిండిపోయింది. అధికారులు రద్దీకి తగినన్ని బస్సులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఖజానాకు రూ. 53,57,147 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. ఆధ్యాత్మిక వాడల్లో 1,708 దంపతులు సత్యదేవుడి వ్రతాలు జరిపించారు.

స్వామికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్య క్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టి, సాయంత్రం అలంకార వెండి జోడుసేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య కైంకర్యాలు వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి, మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి, జస్టిస్ సుజాత కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేయగా వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు.

యాదగిరిగుట్ట ఈవో విభాగాల పర్యటన

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో ఈవో ఎస్. వెంకట్రావు పర్యటించారు. పలు విభాగాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేకువజామున 4.30 గంటలకు ప్రధానాలయం, ప్రాంగణం, ఆలయ పరిసరాలు పరిశుభ్రత విషయంలో రాజీ పడొద్దని సిబ్బందిని ఆదేశించారు. నిజాభిషేకం నిర్వహించే సమయంలో నేరుగా భక్తులను అడిగి తెలుసుకున్నారు.

ఆంధ్రజ్యోతి ****
నల్లగొండ
నకిరేకల్, మునుగోడు
8 www.andhrajyothy.com ● ఆదివారం 9 నవంబరు 2025

ఆర్థిక సాయం అందజేత

నాంపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన ఎదుళ్ల క్రిష్టయ్య శనివారం మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు గజ్జల శివరెడ్డి పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. ఆయన వెంట గాదెపాక రమేష్, పానగంటి వెంకన్న, కాలనీవాసులు ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలి

దేవరకొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తుపాన్‌తో దేవరకొండ మండలంలో పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలని సీపీఐ దేవరకొండ మండల కార్యదర్శి దేవ సుదర్శన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తుపాన్ కారణంగా పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. ఎకరాకు రూ.30వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

అసలే పంట నష్టం.. ఆపై ఆర్థిక కష్టం


శాలిగౌరారంలో నేలవాలిన వరి చేనును కొస్తున్న చైన్ మిషన్

- నేల వాలిన వరి పంట.. మిషన్‌తో వరి కోతలు
- అధిక సమయం పడుతుండడంతో ఆర్థిక భారం

శాలిగౌరారం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో పాటు మొంథా తుపానుతో కోత దశకు వచ్చిన వరి చేను నేలకొరిగాయి. రోజుల తరబడి వర్షాలు కురవడంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. నేలకొరిగిన వరి పంట చాలా ప్రాంతాల్లో మొలకెత్తాయి. ఉన్న పంట కోయడానికి కూలీలు, వరికోత మిషన్లు దొరకక రైతులు అవస్థలు పడుతున్నారు. వరి కోత మిషన్లు దొరికినా నేలకొరిగిన వరిని కోయడానికి అధిక సమయంతో పాటు ఆర్థిక భారం కూడా రైతులు మరింతగా ఆందోళన చెందుతున్నారు. వరి కోత మిషన్లకు బాగా గిరాకీ పెరిగింది. గిరాకీ పెరిగినా వరికోత మిషన్లు అందుబాటులో ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేలవాలిన వరి చేను కోయడానికి అధిక సమయం..

సాధారణ రోజుల్లో వరికోత మిషన్ ద్వారా వరిని కోయడానికి గంటకు రూ.3వేలు ఖర్చు అవుతుంది. కానీ నేలకొరిగిన వరిని మిషన్ ద్వారా కోయడానికి అధిక సమయం పడుతుండడంతో రూ.4వేలకు పైగా రైతుకు ఖర్చు అవుతుంది. కోసిన ధాన్యం అరబెట్టడానికి కనీసం మూడు రోజుల పడుతుంది. పంట కోతకు అధిక సమయం పడుతుండడంతో రైతుపై ఆర్థిక భారం పడుతోంది. శాలిగౌరారం మండలంలోని 24 గ్రామాల్లో 18 వేల ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. ఈ అకాల వర్షాలకు దాదాపు రెండు వేల ఎకరాలకు పైగా నష్టం వాటిల్లినట్లు తెలిసింది.

వరి కోత మిషన్లకు భారీగా డిమాండ్

వ్యవసాయ ప్రధానమైన శాలిగౌరారం మండలంలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులంతా వరి కోతలు కోయడానికి ఆత్రుత పడుతున్నారు. రైతులంతా ఒకేసారి వరి కోతలకు సిద్ధం కావడంతో వరికోత మిషన్లకు డిమాండ్ పెరిగింది. కూలీలు దొరకక, మిషన్లు అందుబాటులో లేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

వరికోత మిషన్ దొరకక నేల వాలిన వరి మొలకెత్తింది



రామగిరి గ్రామ సమీపంలో మూడున్నర ఎకరాల వరి పంట సేద్యం చేశాను. కోత దశకు వచ్చే సమయానికి మొంథా తుపాన్‌తో పాటు వారం రోజుల పాటు భారీ వర్షాలు కురవడం వల్ల మూడున్నర ఎకరాల వరి చేను మొత్తం నేలకొరిగింది. కోయడానికి వరికోత మిషన్లు సకాలంలో దొరకక పోవడంతో నేలకొరిగిన వరి అంతా మొలకెత్తి తీవ్రంగా నష్టపోయాను.

– నిమ్మల వీరస్వామి, రైతు రామగిరి

ఆశా వర్కర్ల జిల్లా కమిటీలో చోటు


సైదమ్మ, నవనీత

శాలిగౌరారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల యూనియన్(సీఐటీయూ) నల్లగొండ జిల్లా కమిటీలో మండలానికి చెందిన ఇద్దరికి చోటు దక్కింది. యూనియన్ జిల్లా 5వ మహాసభలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన ఆశా వర్కర్ గుండ్ల సైదమ్మ, జిల్లా సహాయ కార్యదర్శిగా బాలిశెట్టిగూడెం గ్రామ ఆశా వర్కర్ బల్లెం నవనీత ఎన్నికయ్యారు. ఆశా వర్కర్ల సమస్యల సాధన కోసం కృషి చేస్తామని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్

శాలిగౌరారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవితాలను నాశనం చేసే మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలని సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల జడ్పీ స్కూల్‌లో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ కోరారు. గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మత్తు బారినపడి జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నా యువతకు శాలిగౌరారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సందేశాలతో అవగాహన కల్పించారు. యువత లక్ష్యం ఏర్పాటు చేసుకొని కష్టపడి లక్ష్యాన్ని సాధించాలని, తల్లిదండ్రుల కలు నెరవేర్చాలన్నారు. ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరమని, నో డ్రగ్స్ సేవ్ లైఫ్ అంటూ కరపత్రాలు పంచుతూ చేతిలో మైక్ పట్టుకుని ఫ్లెక్సీతో విచిత్ర వేషధారణతో ప్రచారం నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అద్దంకి రవికుమార్ పాల్గొన్నారు.

నక్కలపల్లికి రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ అశోక్‌రెడ్డి

శాలిగౌరారం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలం భైరవునిబండ నుంచి అద్దెలోనిబాయి, నక్కలపల్లి వరకు రోడ్డు దశాబ్దాల నుంచి రోడ్డు అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రోడ్డు మరమ్మతులకు జాతీయ ఉపాధి హామీ పథకంలో(ఈజీఎస్) నిధులు మంజూరయ్యాయి. పనులను భైరవునిబండ మాజీ సర్పంచ్ దండ రేణుక అశోక్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగిస్తూ గుంతలను పూడుస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు పడాల శంకర్, దండ శ్రీనివాస్‌రెడ్డి, వాడపల్లి రాజు, గోగు రాధ -మధుసూదన్ రెడ్డి, ఈదులకంటి శంకర్, పులిగిల్ల నర్సింహ, సంకటి శంకర్, మీ సేవ కృష్ణ, లింగయ్య, ఈదులకంటి యాదయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ రమేష్

నల్లగొండ క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్ర సమీపంలోని చర్లపల్లిలో ఈనెల 9వ తేదీన ఆదివారం నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్పీ జి. రమేష్ కోరారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఈ మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని స్థానిక ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహకులు చర్లపల్లి మాజీసర్పంచ్ మేడి శంకర్ మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరంలో గుండె వ్యాధి నిపుణులతో పాటు స్త్రీ వైద్య నిపుణులు, ఎముకలు, జనరల్ కంటి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. చర్లపల్లిలోని గ్రామపంచాయతీ భవనంలో కార్యక్రమం నిర్వహిస్తారని, 14,15, 16వ వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ అధికారుల 'ప్రజాబాట'

(5వ పేజీ తరువాయి)

జాతి మొక్కలను తొలగిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన స్తంభాలు గుర్తించి వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటుచేస్తున్నారు. లోవోల్టేజీ, సరఫరాలో అంతరాయం వంటి సమస్యలకు క్షేత్రస్థాయిలో నమోదు చేసుకుంటున్నారు.

1912పై అవగాహన

విద్యుత్ సమస్యలు తలెత్తినా, సరఫరాలో అంతరాయం ఏర్పడినా వెంటనే పునరుద్ధరణకు విద్యుత్‌శాఖ అమలు చేస్తున్న టోల్ ఫ్రీ నంబర్‌పై 'ప్రజాబాట' కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా 1912తో పాటు, ఫ్యూజ్ ఆఫ్ కాల్ ప్రాధాన్యాన్ని వివరిస్తున్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్

నకిరేకల్, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ వీఆర్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్‌మాదిగ పిలుపునిచ్చారు. . నకిరేకల్‌లో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ దేశ రాజధానిలో అత్యున్నత న్యాయవ్యవస్థగా ఉన్న సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వీఆర్ గవాయ్‌పై దాడి జరిగి నెల రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి కేసులు నమోదు చేయకపోవడం శోచనీయమన్నారు. ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తున్నామని పెద్ద ఎత్తున ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఎంఎస్‌పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజమ్ వెంకటస్వామి, బచ్చలకూరి వెంకటేశ్వర్లు, బీర్రు మహేందర్, బకరం శ్రీనివాస్, యాతాకుల రాజయ్య, నల్ల చంద్రస్వామి, చింత వినయ్‌బాబు, ఇరిగి శ్రీశైలం, మల్లెపాక వెంకన్న, మాచర్ల సైదులు, ఎర్ర వీరస్వామి, కుర్రపాటి కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్ర పుల్లారెడ్డి ఆశయాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్‌కుమార్

నకిరేకల్, నవంబరు 8, (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకోసం నిరంతరం పోరాటం చేసిన ప్రతిఘటన పోరాట నిర్మాత విప్లవోద్యమ నిర్మాత కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి సేవలు మరువరానివని సీపీఐ ఎంఎల్‌పార్టీ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఎం. డేవిడ్‌కుమార్ అన్నారు. నకిరేకల్‌లో యానాల మల్లారెడ్డి స్మారక భవన్‌లో శనివారం జరిగిన చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభలో మాట్లాడుతూ విప్లవోద్యమానికి చంద్ర పుల్లారెడ్డి దిశా దశను నిర్దేశించిన గొప్ప నాయకుడన్నారు. ఇంజనీరింగ్ విద్యను మధ్యలోనే వదిలేసి విప్లవోద్యమంలో అసమానతలు లేని సమాజం కోసం నిరంతరం పోరాడిన నాయకుడన్నారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు జ్వాల వెంకటేశ్వర్లు, అంబటి చిరంజీవి, బొమ్మిడి నగేష్, కునుకుంట్ల సైదులు, గజ్జి రవి, మామిడోజు వెంకటేశ్వర్లు, బీవీ చారి, గద్దపాటి శంకర్, వేముల శంకర్, లింగయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి

నకిరేకల్, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. నకిరేకల్‌లో శనివారం జరిగిన తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఐసీడీఎస్ వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని అందులో భాగంగా టీఎంసీ స్కూళ్లను అంగన్‌వాడీలకు పోటీగా నిలిపిందన్నారు. ప్రతి బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యానికి పాల్పడుతోందన్నారు. సమావేశంలో పొడిచేటి నాగమణి, ఇంద్రకంటి సైదమ్మ, ఎండీ సలీం, లకపక రాజు, వంటిపాక వెంకటేశ్వర్లు, అవుట రవీందర్, లక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

నాయకులంతా హైదరాబాద్‌లోనే..

(5వ పేజీ తరువాయి)

నాయకులు జూబ్లీహిల్స్‌లో ప్రచారంలో మునిగిపోయారు.

గెలుపు ధీమాలో నాయకులు



జూబ్లీహిల్స్ ఉపఎన్నికలను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అధికార కాంగ్రెస్ పార్టీ తన సర్వశక్తులను కేంద్రీకరించింది. కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న నవీన్‌యాదవ్ గెలుపునకు జిల్లా కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు మొదలు రాష్ట్రస్థాయిలో ఉన్న నాయకులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. కాంగ్రెస్ నుంచి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డితో పాటు ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డితో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి నాయకులు ప్రచారం చేస్తున్నారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ నాయకులు సైతం జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అభ్యర్థిని గెలిపించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. బీఆర్‌ఎస్ నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ రాజ్యసభసభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌తో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. బీజేపీ నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావుతో పాటు రాష్ట్ర నాయకులు కడియం రాంచంద్రయ్య ప్రచారంలో నిమగ్నమయ్యారు.

గెలుపెవరిదైనా నాయకులు బిజీ బిజీ

అన్ని పార్టీల నాయకులు బిజీగా ఉన్నారు. గెలుపెవరిదైనా జిల్లా నాయకులు మాత్రం బిజీబీజీగా ఉన్నారు. ఈ నెల 11వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. హైదరాబాద్‌లోనే మకాం వేసి తమ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రానికి చెందిన నాయకుడితో పనికోసం అతడి ఇంటికి వెళ్లగా హైదరాబాద్‌లో ఉన్నాడని చెప్పడం తిరిగి మరుసటి రోజు వెళ్లడం ఇలా 10రోజులుగా నాయకుడు ఇంటికి రావడం లేదని ఉసురుమన్నాడు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నాగార్జునసాగర్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి కరాటే పోటీల్లో నాగార్జునసాగర్ హిల్‌కాలనీకి చెందిన స్కూల్ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే టోర్నమెంట్ కం సెలక్షన్స్‌లో అండర్-17 విభాగంలో ,80 కిలోల విభాగంలో సయ్యద్ అబ్దుల్ ముసాఫిర్, 68 కిలోల విభాగంలో ఎస్‌వీఎస్ఎం కృష్ణసాయి బంగారు పతకం సాధించారని ప్రిన్సిపాల్ శివకుమార్ తెలిపారు. అండర్-14 విభాగంలో 35కిలోల విభాగంలో బణావత్ వెంకటేష్, సిల్వర్ పతకం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ నకుల్‌రావు, కరాటే మాస్టర్ వెంకట్, ఉపాధ్యాయులు రాజ్యం, రజియా, స్నేహలత, సంయోజిత, బ్యూలా, సంతోషిణి, శరత్ అభినందించారు.

పూర్వ విద్యార్థుల మమకారం


పాఠశాల గేటు ప్రారంభంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


చిట్యాలరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యనందించి ఉన్నత స్థాయిలో నిలిపిన పాఠశాలపై మమకారం చాటుకున్నారు పూర్వ విద్యార్థులు. 1985-86 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు పాఠశాలకు గేటు, దానిపై ఆర్చి ఏర్పాటు చేశారు. దీనికి పూర్వ విద్యార్థులు తమవంతు సహకారం అందించారు. పూర్వ విద్యారులు ఎన్ఆర్ఐ కోయగూర శ్రీనివాస్‌గౌడ్, ఏదుళ్ళ ప్రభాకర్‌రెడ్డి(ఏఇ), సప్పిడి మోహన్‌రెడ్డి(డీఎస్పీ), పొట్లపల్లి వెంకన్న, సప్పిడి సీనారెడ్డి, ఏర్పుల యాదయ్య, వరికుప్పల మల్లేష్, గంగపురం భాస్కర్, పొట్ట శ్రీనివాస్, కోట రాంబాబు, గుర్రం వెంకటేష్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. శ్రీధర్, లుకేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు తాటి చంద్రమౌళి, మాజీ సర్పంచ్ మర్రి జలందర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేష్, నీలకంఠం నరేష్, ఆవుల జానయ్య, ఏర్పుల రాకేష్ పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మతసామరస్యం


అయ్యప్పస్వామి మాలధారులకు భోజనం వడ్డిస్తున్న ఎస్ఐ రవి, అన్వర్

మునుగోడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అయ్యప్పదీక్ష చేపట్టిన స్వాములకు అన్నదానం చేసి మత సామరస్యాన్ని చాటి చెప్పారు మండలకేంద్రానికి చెందిన మండల పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ. అన్వర్. ఎస్ఐ ఇరుగు రవి ఆహ్వానించి భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా నిలవడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సామాజిక దృక్పదంతో పేదల కోసం చేసే సేవలను స్ఫూర్తిగా ఐదేళ్ల కాలంగా అయ్యప్ప స్వామి మాలధారులకు భిక్ష ఏర్పాటు చేస్తున్నట్లు అన్వర్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పందుల నర్సింహ, మిర్యాల వెంకన్న, యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థం


నిల్వ ఉన్న మురుగు నీరు

మర్రిగూడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండల కేంద్రం లోని పాత బస్టాండ్ సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ మురుగు కూపంగా మారింది. బస్టాండ్ సమీపంలో పాత గ్రామపంచాయతీ కార్యాలయానికి సంబంధించిన మడిగెలు ఉండేవి. ఈ మధ్య కాలంలో మడిగెలకు సంబంధించిన భవనాన్ని శిథిలావస్థకు చేరుకోవడంతో కూల్చివేశారు. ఈ మడిగలు చుట్టూ ఓపెన్ డ్రైనేజీ కాల్వ ఉన్నందున భవనాన్ని మరమ్మతులు చేయలేక చేపట్టక పోవడంతో ఇక్కడ పెద్ద గుంత ఏర్పడి ఎస్సీ కాలనీ నుంచి వచ్చే ఇళ్లలో మురుగు నీరు ఈ డ్రైనేజీ గుంతలో చేరుతుంది. మురుగు నీరు చేరడంతో ఇక్కడ ఉన్న ప్రజలకు దుర్గంధం, దీనికి తోడు దోమలకు నిలయంగా మారింది. ఇబ్బందులకు లోనవుతున్నామని, అధికారులు స్పందించి డ్రైనేజీ మరమ్మతులు చేయించి మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్టీ జాబితాపై కాంగ్రెస్ వైఖరి ప్రకటించాలి

దామరచర్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులుగా ఉంటూ లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే వైఖరి తీసుకున్న సోయం బాబురావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుల తీరుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరి ప్రకటించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి లావుడియా ఎర్రనాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవినాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 సంవత్సరాలుగా ఎస్టీ జాబితాలో ఉన్న లంబాడీ గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సోయం బాబురావు, తెల్లం వెంకట్రావు డిమాండ్ చేయడం రాజ్యాంగ వ్యతిరేకమని అన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీంకోర్టులో కేసు వేయడం, ఆ పేరుతో విద్వేష ప్రసంగాలు చేస్తూ గిరిజన తెగల్లో ఘర్షణ సృష్టిస్తున్నారని అన్నారు. ఆదివాసీలపై వీరికి చిత్తశుద్ధి ఉంటే కోట్లాది మంది ఆదివాసి గిరిజనుల హక్కులను, షెడ్యూల్డ్ ప్రాంత రాజ్యాంగ హక్కుల్ని కాలరాస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన అటవీ సంరక్షణ నియమాల చట్టం-2023కు వ్యతిరేకంగా పోరాడాలని హితవు పలికారు. ఓటు బ్యాంకు రాజకీయల కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాయలో గిరిజనులు పడొద్దని విజ్ఞప్తి చేశారు.



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.60 (310.8498)	51,282	51,282
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.95 (4.18)	4,132.84	3,983.93
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.440 (44.8973)	34,274	58,736

చికెన్ ధరలు	లైవ్ : రూ.149	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.250



విద్యుత్ అధికారుల ప్రజాబాట

విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించడమే లక్ష్యంగా విద్యుత్‌శాఖ 'ప్రజాబాట' కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా వారంలో మూడు రోజులు మంగళ, గురు, శనివారాల్లో ఎస్ఈ నుంచి ఆర్టిజన్ స్థాయి వరకు ఉన్న సిబ్బంది, అధికారులు నేరుగా క్షేత్రస్థాయిలో పర్యటి స్తూ విద్యుత్ నెట్‌వర్క్‌ను తనిఖీ చేస్తున్నారు. అంతేగాక వినియోగదారుల నుంచి నేరుగా ఫిర్యాదులు, సలహాలు తీసుకుంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ టౌన్)

- వారానికి మూడు రోజులు
- క్షేత్ర స్థాయిలో విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం

కొన్నింటిని తక్షణమే పరిష్కరిస్తున్నాం



వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడమే లక్ష్యంగా 'ప్రజాబాట' కార్యక్రమం చేపడుతున్నాం. అందులో భాగంగా సరఫరాలో అంతరాయం తలెత్తకుండా సాధ్యమైనంత వరకు అందుబాటులో ఉన్న సామగ్రితో సమస్యలను పరిష్కరిస్తున్నాం. నూతన స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల తదితర ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తున్నాం. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పెరిగిన మొక్కలను, విద్యుత్ తీగలకు అల్లుకుంటున్న తీగ మొక్కలను తొలగిస్తున్నాం.

- వెంకటేశ్వర్లు, ఎస్ఈ, నల్లగొండ

విద్యుత్ అధికారులు నేరుగా ప్రజల వద్దకు వస్తుండటంతో గ్రామాలు, పట్టణాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు వారి దృష్టికి వస్తున్నాయి. అదేవిధంగా అధికారులు వారంలో మూడు రోజుల పాటు 'ప్రజాబాట' కోసం వస్తున్నారని తెలిసి ప్రజలు సైతం నేరుగా కలిసి సమస్యలు విన్నవిస్తున్నారు. ఫలితంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు సైతం పరిష్కారం లభిస్తోంది. 'ప్రజాబాట'లో ఎల్టీ లైన్లు, 11కేవీ, 33కేవీ లైన్లను, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను, ఏబీ స్విచ్ వంటి విద్యుత్ పరికరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. దీంతో విద్యుత్ సరఫరాలో నాణ్యత మరింత మెరుగుపడుతోంది. దీనికి తోడు ఫిర్యాదులు తగ్గడంతో పాటు నెట్‌వర్క్ బలపడి విద్యుత్ లాస్ (నష్టం) కూడా తగ్గుతోంది. నిర్దేశించిన మేరకు వారంలో మూడు రోజులు ఉదయం 8 నుంచి 10.30గంటల వరకు విద్యుత్ అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం

తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ పరిధి లోని అన్ని ఉమ్మడి జిల్లాలతో పాటు ఉమ్మడి నలగొండ జిల్లాలో విద్యుత్ అధికారుల 'ప్రజాబాట' ప్రారంభమైంది. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలో ఈ కార్యక్రమం లాంఛనంగా ఈ నెల 6వ తేదీన ప్రారంభమైంది. మూడు జిల్లాలో కూడా ఎస్ఈ స్థాయి క్యాడర్ నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అంతా 'ప్రజాబాట' కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకుంటున్నారు. విద్యుత్ నెట్‌వర్క్‌ను పరిశీలించి వినియోగదారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తున్నారు.


ప్రాంతాల వారీగా పర్యటనలు

'ప్రజాబాట' కార్యక్రమంలో భాగంగా అధికారులు సిబ్బంది ప్రాంతాల వారీగా పర్యటించి సమస్యలను గుర్తించాలని నిర్ణయించారు. అందులో భాగంగా వారంలో మూడు రోజులు ప్రాంతాల వారీగా ప్రత్యేక షెడ్యూల్ రూపొందించుకొని ఆ దిశగా ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. సమస్యలను గుర్తించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల ప్రారంభించిన 'ప్రజాబాట' కార్యక్రమంలో భాగంగా విద్యుత్ అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యటించి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పెరిగిన మొక్కలను, విద్యుత్ తీగలకు అల్లుకుంటున్న తీగ..

- మిగతా 8వ పేజీలో...

నాయకులంతా హైదరాబాద్‌లోనే

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో వివిధ పార్టీల నాయకులు



జిల్లా నాయకులంతా హైదరాబాద్‌లో మకాం వేశారు. రాష్ట్ర రాజధానిలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో వివిధ పార్టీల నాయకులు అక్కడ ప్రచారంలో పాల్గొంటున్నారు. పోటాపోటీగా కొనసాగుతున్న ప్రచారంలో తమ పార్టీల అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తూ గెలుపు కోసం కృషి చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

కొద్దిరోజులుగా జిల్లాలోని అన్నిపార్టీల నాయకులు అంతా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే ఉంటూ ప్రచారంలో మునిగిపోయారు. తమకు తెలిసిన బంధువులను, నాయకులను సమన్వయం చేసుకుంటూ గెలుపు కోసం తీవ్రంగా కష్టపడుతున్నారు. దీంతో జిల్లాలో నాయకుల సందడి కొద్దిరోజులుగా కనిపించడం లేదు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే నాయకులు సైతం జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో నిమగ్నమయ్యారు. ఇంటింటికి తిరుగుతూ అభ్యర్థుల గెలుపు వేటలో ముందుకు సాగుతున్నారు. తమ బంధువులకు ఫోన్లు చేస్తూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గమైన జూబ్లీహిల్స్‌లో సుమారు 4లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. ధనవంతులతో పాటు వెనుకబడిన ప్రాంతాలే ఎక్కువగా ఉన్నాయి. బస్తీల్లో పలుకుబడి ఉన్న నాయకుడిని మచ్చిక చేసుకుంటేనే అక్కడ గెలుపు సాధ్యమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని నాయకులు కూడా వారికి ఉన్న పరిచయాలను వాడుకుంటూ గెలుపు కోసం కృషి చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి మంత్రులు, రాష్ట్ర నాయకులు రంగంలోకి దిగారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అదేవిధంగా మరోమంత్రి కోమటిరెడ్డివెంకట్‌రెడ్డి కూడా ప్రతి ర్యాలీలో పాల్గొంటున్నారు. మాజీమంత్రి జగదీష్‌రెడ్డి పూర్తిగా జూబ్లీహిల్స్‌లో మకాం వేశారు. ప్రతీ గడపకు వెళ్లి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. మొత్తంమీద జిల్లాలో వివిధ పార్టీల

- మిగతా 8వ పేజీలో...

మితంగా తింటే ఆ'హారం'

- లేదంటే ఇక అంతే సంగతి
- మెరుగైన జీవన విధానం.. మారుతున్న శైలి
- ఒక్కొక్కరిదీ ఒక్కో విధానం
- పర్యవేక్షణ అవసరమంటున్న నిపుణులు

7

సండే ఫోకస్



ఉరుకుల పరుగుల జీవనం. త్వర త్వరగా కావాలన్న కాంక్ష. తీరొక్క రుచి కోరే జిహ్వ. వెరసి ఏం తింటున్నామో.. ఎంత తింటున్నామో.. ఎందుకు తింటున్నామో.. తెలియకుండా పొట్టను నింపుతున్నాం. దీంతో ఊబకాయం, మధుమేహం, బీపీ.. తదితర రుగ్మతలు దీర్ఘకాలంగా వెంటాడడం పరిపాటిగా మారింది. అయితే మారుతున్న జీవన శైలిలో మితమైన ఆహారమే అమృతమని, లేదంటే విషంగా మారే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోజూ తీసుకునే ఆహారంలో ఖచ్చితంగా డైట్ పాటించాలని, లేకుంటే శరీరం రోగాల కుప్పగా మారుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, అందులో ప్రొటీన్లు, విటమిన్లు, కార్బోహైడ్రేట్లు, మాంసకృత్తులు తగిన పాళ్లలో ఉండాలంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

చండూరు పీహెచ్‌సీలో ఖాళీగా కుర్చీలు

హాజరు కాని ఇద్దరు ఉద్యోగులు

చండూరు,నవంబరు8(ఆంధ్రజ్యోతి):చండూరు మునిసిపల్ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యులు సకాలంలో రాకపోవడంతో అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు ఎదురుచూసి వెళ్లిపోతున్నారు. ఉదయం 9గంటలకే ఆరోగ్యకేంద్రానికి చేరుకోవాల్సిన వైద్యులు, సిబ్బంది శనివారంమధ్యాహ్నం 12.32గంటలు అవుతున్నా ఒక్కరూ రాలేదు.



చండూరు పీహెచ్‌సీలో మధ్యాహ్నం 12.32 గంటల వరకు కూడా ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యాధికారి కుర్చీ

పర్యవేక్షణేదీ?

ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో వైద్యులు, సిబ్బంది డ్యూటీలకు డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్య కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి. కానీ, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం మధ్యాహ్నం 12.32 గంటల వరకు కేవలం ఐదుగురు సిబ్బంది మాత్రమే హాజరుకాగా, మరికొందరు సెలవులో ఉన్నారు. కొందరు మాత్రం సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా హాజరయ్యారు. దీంతో 100మందికి పైగా రోగులు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వైద్యాధికారులు లేకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు 24 గంటలు వైద్య సేవలు అందించాల్సి ఉండగా, ఒక్కరూ కనిపించలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని వివరణ కోరగా, ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండాల్సిందేనని, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరైన ఘటననూ విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇద్దరు డుమ్మా

చండూరు పీహెచ్‌సీలో 24గంటల పాటు వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఇద్దరు పురుష, మహిళా వైద్యులను నియమించారు. వీరు షిఫ్టుల వారీగా పని చేయాలి. కానీ, ఈ నిబంధన అమలుకు నోచుకోవడం లేదు. పీహెచ్‌సీలో సీసీ కెమెరాలు ఉన్నాయి. ఈ కెమెరాల ద్వారా పీహెచ్‌సీలో వైద్యులు ఉన్నారో, లేదో తెలుసుకునేందుకు డైరెక్టర్ కార్యాలయంలో మానిటరింగ్ సెల్ కూడా ఏర్పాటు చేశారు. ఈ సెల్ ద్వారా పీహెచ్‌సీలో ఏం జరుగుతుందో లైవ్‌లో చూసేలా సీసీ కెమెరాలను అనుసంధానం చేశారు. కానీ, చండూరు పీహెచ్‌సీలో కెమెరాలు పని చేయకపోవడంతో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వైద్యులు ఇష్టారాజ్యంగా విధులకు డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

రండి.. రండి.. రండి దయచేయండి

- హోటళ్లకు దిక్కుచిలా విజిల్ బ్లోయర్స్
- మెడలో విజిల్...చేతిలో లాఠీ, లైటర్లు
- భోజనానికీ విరామం లేని సమయం
- వయసు మళ్లిన వారే ఎక్కువ

సండే స్పెషల్ SUNDAY SPECIAL

6

ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకురావాలి

డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

కనగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి ఐకేపీ కేంద్రాలకు తీసుకురావాలని డీఆర్డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కనగల్, కుమ్మరిగూడెం, ఎంగొరారంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకొని, రికార్డులను పరిశీలించారు. తేమశాతం వచ్చిన ధాన్యం రాశులను వెంటనే కాంటా వేయాలని ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం మైసేశ్వర్‌రావ్, సీసీ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి



108 కుండలాలతో గాయత్రీ జ్ఞాన మహాయజ్ఞం

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో గాయత్రి పరివార్ అధ్వర్యంలో 108 కుండలాలతో రెండు రోజుల పాటు నిర్వహించిన గాయత్రీ జ్ఞాన మహాయజ్ఞం శనివారం ముగిసింది.

- కొండమల్లేపల్లి

సన్నాల సాగుకు రైతుల ఆసక్తి

- తక్కువ కాలం, అధిక దిగుబడి
- ఉమ్మడి జిల్లాలో 'టిప్‌టాప్'కు పెరిగిన డిమాండ్

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు8: వానాకాలం, యాసంగి సీజన్లలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రైతులు ఎక్కువగా వరి పంటను సాగు చేస్తున్నారు. నాగార్జునసాగర్, మూసీ, శ్రీరాంసాగర్ ఆయకట్టులో సాగు నీరు వస్తుండడంతో రైతులు మెట్ట పంటలకు ప్రత్యామ్నాయంగా వరి సాగు చేస్తున్నారు. అందులో ఎక్కువగా సన్నరకం ధాన్యం పండించేందుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో యాసంగిలో దొడ్డురకం ధాన్యం సాగుచేసేవారు. ఇటీవల యాసంగిలో కూడా సన్నరకం సాగు చేస్తున్నారు. వానాకాలం సన్న ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసింది. విత్తన కంపెనీలు కొన్నేళ్లుగా సన్నరకం ధాన్యం విషయంలో నాణ్యమైన విత్తనాలు తయారు చేస్తున్నాయి. అధిక దిగుబడి, పెట్టుబడి తక్కువ, పంట కాలం తక్కువ ఉండే వరి విత్తనాలను కంపెనీలు మార్కెట్‌లో అందుబాటులో ఉంచాయి. సన్న ధాన్యం రాష్ట్రంలోనేగాక ఇతర రాష్ట్రాలకూ ఎగుమతి అవుతోంది. మార్కెట్‌లో పలు విత్తన కంపెనీలు నాణ్యమైన, మేలైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

'టిప్‌టాప్'కు పెరిగిన డిమాండ్

ఉమ్మడి జిల్లాలో రైతులు ఎక్కువగా యాసంగి సీజన్‌లో 'టిప్‌టాప్' రకం ధాన్యం సాగు చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం మార్కెట్‌లోకి వచ్చిన జీనెక్స్ సీడ్స్ కంపెనీకి చెందిన 'టిప్‌టాప్' రకం వరి విత్తనాలకు డిమాండ్ పెరిగింది. మార్కెట్‌లో లభించే ఇతర విత్తనాల కంటే 'టిప్‌టాప్' రకం మేలుచేకూర్చేలా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఈరకం విత్తనాలు సాగు చేస్తే వరి తక్కువ ఎత్తులో పెరుగుతుంది. దీంతో గాలి, వానలు వచ్చినా పంట నేలవాలదు. అంతేగాక ధాన్యం సన్నగా ఉంటుంది. అత్యధికంగా పిలకలు వేస్తుంది. సాధారణంగా ఇతర రకాలు దుబ్బకు 15 నుంచి 25 పిలకలు వస్తాయి. టిప్‌టాప్ రకం అయితే 30 నుంచి 70 పిలకల వరకు వృద్ధి చెందుతాయి. దీంతో దిగుబడి కూడా అధికంగా వస్తుంది. ఎకరాకు సుమారు 50 నుంచి 55 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. ఇతర వంగడాలతో పోలిస్తే 'టిప్‌టాప్' వంగడానికి అయ్యే ఖర్చు చాలా తక్కువ. చీడపీడలను తట్టుకునే శక్తి కూడా ఉంటుంది. ఈ రకం వంగడం ఎలాంటి నేలలోనైనా సాగు చేయవచ్చు. పంట 120 నుంచి 130 రోజుల్లో చేతికి వస్తుంది. ఎకరాకు 10కిలోల విత్తనాలు సరిపోతాయి. దీంతో రైతులు టిప్‌టాప్ రకం సాగుకు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో ఈ రకం ధాన్యానికి తేమ శాతం 28 నుంచి 30 ఉన్నా మిల్లర్లు క్వింటాకు రూ.2400 నుంచి రూ.2700లకు కొనుగోలు చేస్తున్నారు. కోత కోయగానే పచ్చి ధాన్యాన్ని కూడా విక్రయించవచ్చు. టిప్‌టాప్ రకం ధాన్యంలో ఆయిల్ శాతం ఎక్కువగా ఉండి తినడానికి రుచిగా ఉంటుంది.



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గత యాసంగి సీజన్‌లో సాగు చేసిన 'టిప్‌టాప్' రకం వరి పొలాలు

ADVT

52 బస్తాల దిగుబడి



ప్రతి యాసంగి సీజన్‌లో టిప్‌టాప్ రకం ధాన్యాన్ని సాగు చేస్తున్నా. ఇప్పటి వరకు నాలుగు సీజన్లలో టిప్‌టాప్ రకాన్ని సాగు చేశా. ఎకరాకు 52 బస్తాల దిగుబడి వచ్చింది.

ఎన్. సతీష్, రైతు, కొండ్రపోల్ గ్రామం, దామరచర్ల మండలం, నల్లగొండ జిల్లా

రైతుల ఆసక్తి



వానాకాలంలో పాటు యాసంగిలో కూడా రైతులు సన్నరకం ధాన్యం సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువగా యాసంగిలో టిప్‌టాప్ రకం సాగు చేస్తున్నట్లు క్షేత్రస్థాయిలో రైతుల నుంచి సమాచారం వస్తుంది.

శ్రవణ్‌కుమార్, జేడీఏ నల్లగొండ.

బౌద్ధుల ఆరాధన క్షేత్రం.. సాగర్

- థాయ్‌లాండ్ బౌద్ధ భిక్షువులు

7

పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలి

దేవరకొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తుపాన్‌తో దేవరకొండ మండలంలో పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించాలని సీపీఐ దేవరకొండ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. తుపాన్ కారణంగా పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. ఎకరాకు రూ.30వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

వృద్ధుల సంక్షేమానికి కృషి

చింతపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని వ్యవస్థాపకుడు సోల్లేటి శంకరాచారి తెలిపారు. శనివారం మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన అర్చకుడు మొకిరాల శ్రీకాంత్‌శర్మ 50 కిలోల బియ్యం, వంట సామగ్రిని అందజేశారు. సమాజంలోని వృద్ధులకు సేవ చేయడం చాల సంతోషంగా ఉందన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నాగార్జునసాగర్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి కరాటే పోటీల్లో నాగార్జునసాగర్ హిల్‌కాలనీకి చెందిన స్కూల్ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే టోర్నమెంట్ కం సెలక్షన్స్‌లో అండర్-17 విభాగంలో ,80 కిలోల విభాగంలో సయ్యద్ అబ్దుల్ ముసాఫిర్, 68 కిలోల విభాగంలో ఎస్‌వీఎస్ఎం కృష్ణసాయి బంగారు పతకం సాధించారని ప్రిన్సిపాల్ శివకుమార్ తెలిపారు. అండర్-14 విభాగంలో 35కిలోల విభాగంలో బణావత్ వెంకటేష్, సిల్వర్ పతకం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను కరస్పాన్‌డెంట్ నకుల్‌రావు, కరాటే మాస్టర్ వెంకట్, ఉపాధ్యాయులు రాజ్యం, రజియా, స్నేహలత, సంయోజిత, బ్యూలా, సంతోషిణి, శరత్ అభినందించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



జూబ్లీహిల్స్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మైనార్టీ విభాగ జిల్లా చైర్మన్ ఎంఏ. సలీం అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఉప ఎన్నిక జరుగుతున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పరిశీలకుడిగా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. బోరబండ తదితర కాలనీల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరు గ్యారెంటీలతో లబ్ధిపొందుతున్న రాజధాని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అగ్రతాంబూలం ఇచ్చిందన్నారు. గెలుపు నల్లేరుపై నడకలాంటిదేనన్నారు. భవిష్యత్‌లో జరగనున్న ఉప ఎన్నికలలోనూ హస్తం పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపావత్ హరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఆరీఫ్, నాయకులు భాస్కర్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

బీసీలకే రాష్ట్ర టీడీపీ అధ్యక్ష పదవి ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవి బీసీలకే కేటాయించాలని టీడీపీ ఓబీసీ విభాగ రాష్ట్ర నాయకుడు పోగుల సైదులుగౌడ్ కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజల కోసం ఆవిర్భవించిన టీడీపీకి తెలంగాణలో కార్యకర్తలు, అభిమానులు లక్షల మంది ఉండగా, వారిలో బీసీలు అధిక శాతం ఉన్నారన్నారు. గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా బీసీనే ప్రకటించిన అధిష్టానం వెనుకబడిన వర్గాలకు తగిన ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఆ తరహాలోనే రాష్ట్ర అధ్యక్ష పదవిలో బీసీనే నియమించాలన్నారు. పార్టీకి ప్రజలకు సేవలందిస్తున్న మాదగోని అరవింద్‌కుమార్‌గౌడ్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



వీటినగర్‌లోని అయ్యప్ప దేవాలయంలో అన్నప్రసాద వితరణ

చింతపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్ల గ్రామానికి చెందిన లగ్గోని ఇదయ్య, రాధిక దంపతులు అయ్యప్ప స్వాములకు శనివారం అన్న ప్రసాద వితరణ చేశారు. అయ్యప్ప సేవా సమితి చైర్మన్ కనిగిరి గోవర్ధన్ మాట్లాడుతూ దాతలు స్వచ్ఛందగా ముందుకు వచ్చి అన్నదానంతో పాటు అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థలదాత లగ్గోని యాదయ్య సతీమణి అశ్వినీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మద్దెల కృష్ణగౌడ్, గురుస్వాములు వైద్యుల ప్రవీణ్‌కుమార్‌శర్మ, మల్లోజు జగదీశ్వరాచారి, మట్ట యాదయ్య గౌడ్, జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం రోజున మండల కేంద్రానికి చెందిన జూలూరు రాజు, సావిత్రి దంపతులు అయ్యప్ప స్వాములకు అన్న దానం చేశా ు. వారిని అయ్యప్ప మాటలాదారులు సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వామి చిట్టెడి ప్రభాకర్‌రెడ్డి, భూతరాజు సత్తయ్య, గుమ్మడవెల్లి జనార్దన్, బోడ అశోక్‌యాదవ్, బత్తుల జంగయ్య, బత్తుల విజయ్, బోడ నగేష్, కుంభం రవి, రెడ్డిమల్ల శ్రీను, ఇమ్మడి రమేష్, అయ్యప్ప మాలాదారులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కొండమల్లేపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపిన ప్రకారం.. డిండి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన జటమోని నరసింహ(55) హైదరాబాద్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. భార్య గెల్వమ్మ కరోనా సమయంలో మృతిచెంగా, అప్పటి నుంచి జటమోని నరసింహ ఒంటిరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలోనే కుమారుడు జటమోని అంజనేలు, కోడలు మాధవి తరచూ గొడవ పడుతుండడంతో కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై శుక్రవారం సాయంత్రం డ్యూటికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి డ్యూటీకి వెళ్లకుండా కొండమల్లేపల్లికి వచ్చి పశువుల సంతలో శుక్రవారం రాత్రి ఓ రేకుల పందిరికి తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు అంజనేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

విద్యుత్ అధికారుల 'ప్రజాబాట'

(5వ పేజీ తరువాయి)

జాతి మొక్కలను తొలగిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన స్తంభాలు గుర్తించి వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటుచేస్తున్నారు. లోవోల్టేజీ, సరఫరాలో అంతరాయం వంటి సమస్యలకు క్షేత్రస్థాయిలో నమోదు చేసుకుంటున్నారు.

1912పై అవగాహన

విద్యుత్ సమస్యలు తలెత్తినా, సరఫరాలో అంతరాయం ఏర్పడినా వెంటనే పునరుద్ధరణకు విద్యుత్‌శాఖ అమలు చేస్తున్న టోల్ ఫ్రీ నంబర్‌పై 'ప్రజాబాట' కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా 1912తో పాటు, ఫ్యూజ్ ఆఫ్ కాల్ ప్రాధాన్యాన్ని వివరిస్తున్నారు.

పార్కుల సుందరీకరణ

● మిర్యాలగూడ మునిసిపాలిటీ కార్యాచరణ ● ఆహ్లాదం పంచేందుకు కసరత్తు ● వనాలకు పెరగనున్న ప్రజాదరణ



పట్టణంలోని సుందరయ్య పార్కు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు మునిసిపల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పట్టణంలోని పార్కులను అభివృద్ధి చేసే దిశగా అగుడులు వేస్తున్నారు. పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపులోని సుందరయ్య పార్కు, హౌసింగ్ బోర్డులోని రెండు పార్కులు, చైతన్యనగర్‌లోని బోటింగ్ ప్రాంతంలో మరో పార్కు, షాబూనగర్‌లో ఒకటి, ఇందిరమ్మ కాలనీలలో మూడు పార్కులున్నాయి. పట్టణంలో స్పాంజ్ పార్కు ఏర్పాటు చేసే దిశగా ఆలోచన చేస్తున్నారు మునిసిపల్ అధికారులు.

పచ్చని చెట్లు, పచ్చిక బయళ్లు..

పట్టణంలోని పార్కుల్లో పచ్చదనం లోపించడంతో పాటు నిర్వహణ లేకుండా పోయిందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. నందన వనాలతో వాకింగ్ ట్రాక్‌లు లేకపోవడం, ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లలో వ్యాయామ పరికరాలు ధ్వంసం కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు సెలవుల్లో సేదదీరేందుకు మునిసిపాలిటీ పరిధిలోని పార్కులలో సౌకర్యాలు లేకపోవడం, అరకొర వసతులు ఉండటంతో నిరుత్సాహానికి గురవుతున్నారు.

అభివృద్ధికి నిధుల కేటాయింపు

పార్కులను అభివృద్ధి చేసేందుకు అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులు కేటాయించనున్నారు. మునిసిపాలిటీకి ఇటీవల విడుదలైన యూఈడీఎఫ్ నిధులు రూ.16.70కోట్లలో పార్కుల అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయించారు. ఆయా నిధులతో పార్కుల్లో పచ్చికబయళ్లు, పచ్చని చెట్లను పెంచడంతో పాటుగా ఫౌంటైన్లు, సహజ ఇతివృత్తాలను ప్రతిబింబించే శిల్పాలను ఏర్పాటు చేయనున్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు



పట్టణ ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా మునిసిపల్ పరిధిలోని పార్కులను అభివృద్ధి చేయనున్నాం. అందుకు అవసరమైన ఆలోచనలు చేయడంతో పాటు అంచనాలు రూపొందించాం. పట్టణంలోని పాత పార్కులను అదనపు సౌకర్యాలు కల్పించడంతో పాటు శివారు ప్రాంతాలలో కేటాయించిన స్థలాల్లో పార్కులను యూఈడీఎఫ్ నిధులతో అభివృద్ధి చేయనున్నాం.

గణవేణి శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

ఎస్టీ జాబితాపై కాంగ్రెస్ స్పష్టమైన వైఖరి ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్రనాయక్

దామరచర్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులుగా ఉంటూ లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే వైఖరి తీసుకున్న సోయం బాబురావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుల తీరుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరి ప్రకటించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి లావుడియా ఎర్రనాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవినాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 సంవత్సరాలుగా ఎస్టీ జాబితాలో ఉన్న లంబాడీ గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సోయం బాబురావు, తెల్లం వెంకట్రావులు డిమాండ్ చేయడం రాజ్యాంగ వ్యతిరేకమని అన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీంకోర్టులో కేసు వేయడం, ఆ పేరుతో విద్వేష ప్రసంగాలు చేస్తూ గిరిజన తెగల్లో ఘర్షణ సృష్టిస్తున్నారని అన్నారు. ఆదివాసీలపై వీరికి చిత్తశుద్ధి ఉంటే కోట్లాది మంది ఆదివాసి గిరిజనుల హక్కులను, షెడ్యూల్డ్ ప్రాంత రాజ్యాంగ హక్కుల్ని కాలరాస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన అటవీ సంరక్షణ నియమాల చట్టం-2023కు వ్యతిరేకంగా పోరాడాలని హితవు పలికారు. ఓటు బ్యాంకు రాజకీయల కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాయలో గిరిజనులు పడొద్దని విజ్ఞప్తి చేశారు. అనంతరం తెలంగాణ గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా సపావత్ పాపానాయక్, అంగోతు కాంతారావుతోపాటు మరో 18మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వినోద్‌నాయక్, శ్రీహరి, చంద్రకళ, శ్రీహరి, చంద్రకళ, దయానంద్, బాలు, విజయ్ పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

గుర్రంపోడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈనెల 29, 30 జరుగనున్న సీఐటీయూ జిల్లా 13వ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం గుర్రంపోడు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ మహాసభలకు 350 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభలలో కార్మికులు ఎదుర్కొనే సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాట కార్యక్రమాలు చర్చిస్తామన్నారు. కార్మిక వర్గ హక్కుల కోసం సమరశీల ఉద్యమాలు చేపట్టిన చరిత్ర సీఐటీయూకే ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్‌ల పేరుతో కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే కుట్ర జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలతోపాటు సమస్యలను ఈ మహాసభలలో చర్చిస్తామన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు వనమాల కామేశ్వర్, సీఐటీయూ మండల కన్వీనర్ పగిడిమర్రి సర్వయ్య, యాదయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

వైభవంగా గాయత్రి జ్ఞాన మహా యజ్ఞం



యజ్ఞక్రతువులో పాల్గొన్న రుత్వికులు

కొండమల్లేపల్లి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండల కేంద్రంలో గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 108 కుండాల గాయత్రి జ్ఞాన మహాయజ్ఞం శనివారం ముగిసింది. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన ఈ క్రతువులో హరిద్వార్ నుంచి వచ్చిన గురూజీలు యజ్ఞ క్రతువును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు యజ్ఞం యొక్క ప్రాశస్త్యాన్ని భక్తులకు క్షుణ్ణంగా వివరించారు. పట్టణ ప్రజలతో పాటు చుట్టు పక్కల మండలాలకు చెందిన సుసుమారు 2వేలకు పైగా భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కాగా కుషాల్ విజయ్ సోదరులు సుమారు 350 గజాల స్థలములో గాయత్రి ఆలయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్, శ్రీశైలం, వింజమూరి చంద్రమౌళి, సత్యనారాయణ, దాచేపల్లి వెంకటేశ్వర్లు, ఏరుకొండ రాము, జగన్, మారం వెంకన్న యాద ధనయ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాయకులంతా హైదరాబాద్‌లోనే..

(5వ పేజీ తరువాయి)

నాయకులు జూబ్లీహిల్స్‌లో ప్రచారంలో మునిగిపోయారు.



గెలుపు ధీమాలో నాయకులు

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికార కాంగ్రెస్ పార్టీ తన సర్వశక్తులను కేంద్రీకరించింది. కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న నవీన్‌యాదవ్ గెలుపునకు జిల్లా కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు మొదలు రాష్ట్రస్థాయిలో ఉన్న నాయకులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. కాంగ్రెస్ నుంచి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డితో పాటు ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డితో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి నాయకులు ప్రచారం చేస్తున్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ నాయకులు సైతం జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అభ్యర్థిని గెలిపించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ రాజ్యసభసభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌తో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. బీజేపీ నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావుతో పాటు రాష్ట్ర నాయకులు కడియం రాంచంద్రయ్య ప్రచారంలో నిమగ్నమయ్యారు.

గెలుపెవరిదైనా నాయకులు బిజీ బిజీ

అన్ని పార్టీల నాయకులు బిజీగా ఉన్నారు. గెలుపెవరిదైనా జిల్లా నాయకులు మాత్రం బిజీబీజీగా ఉన్నారు. ఈ నెల 11వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. హైదరాబాద్‌లోనే మకాం వేసి తమ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రానికి చెందిన నాయకుడితో పనికోసం అతడి ఇంటికి వెళ్లగా హైదరాబాద్‌లో ఉన్నాడని చెప్పడం తిరిగి మరుసటి రోజు వెళ్లడం ఇలా 10రోజులుగా నాయకుడు ఇంటికి రావడం లేదని ఉసురుమన్నాడు.

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



దేవరకొండలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

డిండి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 56వ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. రాజీవ్ చౌరస్తా వద్ద కేక్ కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్య క్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డమీది సాయి, నూకం వెంక టేష్, పోల వెంకటేష్, పోలం లక్ష్మణ్, బాధమోని శ్రీనివాస్‌గౌడ్, వావిళ్ల సలయ్య, ఎస్‌కె.రహీం, సలీం, ఖయ్యూమ్, ఖలీం, మాధవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేవరకొండలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వయోవృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవరకొండ నియోజకవర్గంలోని ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కెటాయిస్తు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముకురోజు రాజు, మూడావత్ సాగర్, సేనావత్ మోతిలాల్, చరణ్, సైదులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: మండలకేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాయిని మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, పస్నూరి యుగేందర్‌రెడ్డి, బొడిగె శంకర్, కోట్ల జగదీష్, బూడిద మల్లేష్‌యాదవ్, బక్కలయ్య, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చింతపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలోని వీటీ నగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, జిల్లా నాయకులు అంగిరేకుల గోవర్ధన్, మాస భాస్కర్, పూరె లక్ష్మణ్, గుండ్లపల్లి నరసింహారెడ్డి, ఖలీల్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు బాబోయ్..




నిడమనూరులో వాహనాలకు అడ్డం తిరుగుతున్న కుక్కలు

నిడమనూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతోంది. గ్రామంలో ఎక్కడ చూసినా కుక్కల బెడద తీవ్రంగా ఉంది. గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఇందులో పిచ్చికుక్కలు కూడా ఉండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎక్కడ, ఎప్పుడు కుక్కలు కరుస్తాయోనని వాపోతున్నారు. కుక్కల భయానికి వీధుల్లో తిరగాలంటేనే గ్రామస్తులు జంకుతున్నారు. పలు వీధుల్లో కుక్కలు జనాలను వెంబడిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పిచ్చికుక్కలు పలువురిని కరిచి గాయపర్చాయి. ముఖ్యంగా జాతీయ రహదారిపై కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వ్యాపారులు చికెన్, మటన్ వ్యర్థాలను రోడ్డు మీదనే వేస్తుండటంతో కుక్కలు పెట్రేగిపోతున్నాయి. దీంతో రహదారిపై వాహనాలకు కుక్కలు అడ్డుగా వస్తుండటంతో ప్రమాదాలు జరిగి కుక్కల బారినపడి పలువురు గాయాలపాలవుతున్నారు.

రాత్రి సమయాల్లో భయం భయంగా...

రాత్రి సమయాల్లో కుక్కల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం ఆదమర్చి వాహనాలు నడిపితే కుక్కలు వాహనాల కింద పడితే ప్రమాదాలు జరగాల్సిందే. ఇప్పటికే క్షతగాత్రులయ్యారు. వీటి బెడద కారణంగా పిల్లలను పాఠశాలలకు పంపించడానికి కూడా కొందరు తల్లిదండ్రులు భయపడుతున్నారు. కొన్ని చోట్ల కుక్కల బెడద విపరీతంగా ఉంది. వీటి భయానికి అక్కడ నడవాలంటేనే జనం హడలెత్తిపోతున్నారు. ఇటీవల నల్లగొండ పట్టణంలో ఓ మహిళను కుక్క కరిచి తీవ్రంగా గాయపర్చడమే కాకుండా పొట్టలోని పేగులను బయటకు తీసిన సంఘటనను ప్రజలు గుర్తుకు తెచ్చుకుని హడలిపోతున్నారు. కుక్కల బెడద తీవ్రంగా ఉన్నప్పటికీ పట్టించుకునేవారే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. చికెన్, మటన్ వ్యర్థాలు రోడ్డు మీదనే వేస్తున్నప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు చేస్తున్నారు. వీధుల్లో స్వైర విహారం చేస్తున్న కుక్కలను పూర్తిగా నివారించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని అంటున్నారు.

కుక్కలను నివారించాల్సిన అవసరం ఉంది



నిడమనూరులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ప్రధాన రహదారిపై కుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో వాహనం నడపాలంటేనే భయమేస్తోంది. వాహనానికి అడ్డుగా వస్తే ప్రమాదం జరుగుతుందన్న ఆందోళన ఉంది. పిల్లలు కూడా భయపడుతున్నారు. కుక్కలను నివారించడానికి అధికారులు తగిన తీసుకోవాలి.

● దుబ్బ శ్రీనివాస్, నిడమనూరు.